ప్రజాశక్తి
సోమవారం 25 మార్చి 2024 8 పేజీలు
ప్రకాశం బాపట్ల







శాంతి ర్యాలీ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

సిఏఏ
అమలు యత్నాలను అడ్డుకుందాం..

శాంతి ర్యాలీ కరపత్రం ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చిన పౌరసత్వ సవరణ చట్టానికి(సిఏఏ) వ్యతిరేకంగా ఈ నెల 30న జరిగే నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని పలువురు ప్రజా సంఘాల నాయకులు పేర్కొన్నారు. స్థానిక ఇస్లాంపేట ముస్లిం కమ్యూనిటీ హాలులో నిరసన కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని వామపక్ష, ముస్లిం ప్రజా సంఘాల నాయకులు ఆవిష్కరించారు. సీనియర్ ముస్లిం నాయకులు సయ్యద్ సర్దార్ మాట్లాడుతూ రాజ్యాంగ విరుద్ధమైన ఈ నల్ల చట్టాలను వెనక్కి తీసుకోవాలని, మతపరమైన ఓటు బ్యాంకు రాజకీయాలతో ప్రశాంతంగా జీవించే ప్రజల మధ్య చిచ్చుపెట్టడం తగదన్నారు. రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ నెల 30న వామపక్ష, లౌకిక పార్టీలు, ముస్లిం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఒంగోలు నగరంలో పాత కూరగాయల మార్కెట్ సెంటర్‌లోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ విగ్రహం వద్ద నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు శాంతియుత నిరసన ప్రదర్శన నిర్వహించనునట్లు తెలిపారు. కార్యక్రమానికి వామపక్ష, లౌకికవాదులతో పాటు ముస్లిం సామాజికవర్గం నుంచి కూడా పెద్ద ఎత్తున ఈ ర్యాలీలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమాన్ని మతాలు, పార్టీలకు అతీతంగా ప్రజాస్వామిక వాదులందరూ జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హైకోర్టు అడ్వకేట్ షేక్ కరిముల్లా, ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి సయ్యద్ ఇస్మాయిల్, పఠాన్ కరీముల్లా ఖాన్, షేక్ కపిల్ బాషా, ఆవాజ్ సయ్యద్ హుస్సేన్, ఇన్సాఫ్ షేక్ సాలార్, షేక్ అబ్దుల్ రావుఫ్, షేక్ ఖాజా పాల్గొన్నారు.

కొనింది తక్కువ..బకాయిలు ఎక్కువ.!

- ధాన్యం కొనుగోలు చేస్తామని అప్పట్లో ప్రభుత్వం హామీ
- జిల్లాలో కొనుగోలు లక్ష్యం 78 వేల మెట్రిక్ టన్నులు
- రైతుల నుంచి కొనింది 28 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే..
- అన్నదాతలకు చెల్లించాల్సిన బకాయిలు రూ.36 కోట్లు



ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

'జిల్లాలో ఉన్న 153 రైతుభరోసా కేంద్రాల ద్వారా మద్దతు ధరకు ధాన్యం కొనుగోళ్లు జరుపుతాం. ధాన్యంలో తేమ శాతంతో సంబంధం లేకుండా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తాం. ధాన్యం కొనుగోలు చేసిన 21 రోజుల్లో రైతులకు నగదు చెల్లింపులు చేస్తాం. ధాన్యాన్ని ఆరబెట్టేందుకు జిల్లాలో డ్రయర్లు లేకపోతే పక్క జిల్లాల మిల్లులకు ధాన్యం పంపి అయినా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తాం' అని రాష్ట్ర ప్రభుత్వం రైతులకు గత డిసెంబరు నెలలో హామీ ఇచ్చింది. కానీ అరకొరగానే కొనుగోలు చేసింది. ఆ ధాన్యం కొనుగోలు చేసిన బకాయిలూ నేటికీ చెల్లించకపోవడం గమనార్హం.

జిల్లాలో వరి పంట చేతికందే దశలో డిసెంబరులో సంభవించిన తుపాను కారణంగా రైతులు పంటలు నష్టపోయారు. పంట నష్టాన్ని పరిశీలించేందుకు జిల్లాకు వచ్చిన ముఖ్యమంత్రి జగన్ తుపాను కారణంగా నష్టపోయిన రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని చెప్పారు. అయితే ఆచరణలో సరిగ్గా అమలుకు నోచుకోలేదు. గడిచిన మూడేళ్లుగా ఖరీఫ్ సీజన్‌లో వరి పంట చేతికి వచ్చే సమయంలోనే తుపాన్లు సంభవించి భారీవర్షాల కారణంగా రైతులు నష్టపోతూ వచ్చారు. ప్రతి ఏటా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తామని లక్ష్యాలను నిర్దేశించడమే తప్ప ఆచరణలో కొద్దిమేర మాత్రమే కొనుగోళ్లు జరుగుతూ వచ్చాయి. ఈ ఏడాది కూడా ఖరీఫ్‌లో ధాన్యం కొనుగోలుకు జిల్లా అధికార యంత్రాంగం సమాయత్తమైంది. జిల్లాలో ఖరీఫ్‌లో 2,20,435 ఎకరాల్లో వరిసాగు చెయ్యగా నాలుగున్నర లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఇందులో ప్రభుత్వం 78 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చెయ్యాలని నిర్ణయించడం జరిగింది. 75 కిలోల కామన్ రకం ధాన్యంకు రూ.1,637, గ్రేడ్ 'ఏ' రకం ధాన్యంకు రూ.1,652 చొప్పున ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించింది. జిల్లాలో రైతుభరోసా కేంద్రాల ద్వారా ధాన్యం అమ్మకాలు జరిపే విషయంలో రైతులు గతంలో అనేక ఇబ్బందులు పడుతూ వచ్చారు. ధాన్యం నగదు చెల్లింపుల్లో విపరీత జాప్యం జరుగుతూ వచ్చింది. రవాణా ఇబ్బందులు కూడా ఉన్నాయి. ధాన్యం అమ్మిన తరువాత రైతులు ఆర్‌బికె, బ్యాంకుల చుట్టూ తిరగడం పరిపాటిగా మారింది. గడిచిన మూడేళ్లలో ఏనాడు కూడా రాష్ట్రప్రభుత్వం 21 రోజుల్లోనే నగదు ఇవ్వడం అనేది జరగలేదు. నగదు చెల్లింపుల్లో జాప్యం జరుగుతన్న క్రమంలో రైతులు ప్రైవేట్ వ్యాపారులకు తమ ధాన్యం అమ్మకాలు జరిపారు. బయటి మార్కెట్‌లో ధర బిపిటి రకం ధాన్యానికి 75 కిలోల బస్తాకు రూ.1900 వరకు చెల్లింపులు జరిగాయి. జిల్లాలో 153 ఆర్‌బికెల ద్వారా ధాన్యం కొనుగోలు లక్ష్యం 78 వేల మెట్రిక్ టన్నులు కాగా 68 ఆర్‌బికెల ద్వారా సుమారు 28 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేసింది. వీటికి సంబంధించి నగదు బకాయిలు రూ.36 కోట్లు రెండు నెలలుగా నిలిచిపోయాయి.

రైతుభరోసా కేంద్రాల ధాన్యం కొనుగోళ్లు ఏటేటా తగ్గిపోతున్నాయి. ప్రభుత్వం ▶ 2లో

జోరుగా ఫిరాయింపుల పర్వం

- బలాన్ని పెంచుకునేందుకు అభ్యర్థులు ఎంచుకున్న మార్గం ఇదే..
- పలు నియోజకవర్గాల్లో పార్టీలు మారుతున్న ద్వితీయశ్రేణి నేతలు



ఒంగోలులో దామచర్ల ఆధ్వర్యంలో టిడిపిలో చేరుతున్న యువకులు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

నియోజకవర్గాల్లో ప్రస్తుతం పార్టీ ఫిరాయింపుల పర్వం కొనసాగుతోంది. ఎన్నికల్లో బలాన్ని పెంచుకునేందుకు అభ్యర్థులు ఎంచుకున్న మార్గం ఇప్పుడు ఇదే.. అవకాశం ఉన్న చోట్ల ఇవి జోరుగా సాగుతున్నాయి. అందుకు అభ్యర్థులు అన్ని రకాలుగా ప్రలోభాలతో పాటు అధికారంలోకి రాగానే పెత్తనం పనులు ఇస్తామని హామీలు ఇస్తున్నారు. ఈ పర్వం ఎక్కువగా తెలుగుదేశం నుంచే కనిపిస్తోంది. ఎందుకంటే వైసిపి ఎమ్మెల్యేలు అందరూ స్థానాలు మారారు. ఒంగోలులో తప్ప మిగతా నేతలందరూ మంత్రులతో సహా కొత్త నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్నారు. తమ నేతలు ఇక్కడ లేరనే భావన కూడా పెరిగింది. ముఖ్య అనుచరులు నియోజకవర్గాలు వీడిపోయారు. తమ నేతలు పోటీ చేస్తున్న చోటకు వెళ్లి ఎన్నికల పనుల్లో ఉన్నారు. మిగిలిన నేతలకు తెలుగుదేశం నేతలు గాలం వేస్తున్నారు. దీంతో కొన్ని నియోజకవర్గాల్లో ఫిరాయింపులు జోరుగా సాగుతున్నాయి. ప్రధానంగా పశ్చిమాన ఎక్కువగా ఇవి కనిపిస్తున్నాయి.

గిద్దలూరు నియోజకవర్గంలో నిత్యం పార్టీ ఫిరాయింపుల పర్వం సాగుతోంది. తెలుగుదేశం ఇన్‌ఛార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి అన్ని మండలాల్లో రోజూ ఇదే కార్యక్రమం నడుపుతున్నారు. అక్కడ వైసిపి నుంచి గెలిచిన ఎమ్మెల్యే అన్నా రాంబాబు మార్కాపురం అభ్యర్థిగా రంగంలోకి దిగారు. మార్కాపురం ఎమ్మెల్యే కందురు నాగార్జునరెడ్డిని గిద్దలూరుకు పంపారు. ఈయన గ్రామాల్లో తిరిగి పరిచయాలు పెంచుకునే పనిలో ఉన్నారు. తెలుగుదేశం అభ్యర్థి అశోక్‌రెడ్డి మాత్రం ఊళ్లకు ఊళ్లను పార్టీలోకి చేర్చుకునే కార్యక్రమాలు జోరుగా చేపట్టారు. సర్పంచులు, ఎంపీటీసీలు, ఇతర క్యాడర్లలో ఉన్న నేతలు తెలుగుదేశంలో చేరిపోతున్నారు. వారిని ఏదో రకంగా బుజ్జగించి పార్టీలోకి తీసుకుంటున్నారు. తర్వాత వైపాలెం నియోజకవర్గంలోనూ ఈ తరహా ఫిరాయింపులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. పుల్లలచెరువు మండలంలో కీలక నేతలు చేరిపోయారు. మాగుంట పార్టీలోకి చేరాక కూడా ఆయన అనుచరులు వచ్చి చేరుతున్నారు. మార్కాపురం నియోజకవర్గ పర్యటనకు వెళ్లిన ఎంపీ తనయుడు రాఘవ రెడ్డి సమక్షంలోనే వేములకోట గ్రామస్తులు చేరిపోయారు. ఇలా పశ్చిమాన పార్టీ ఫిరాయింపులు పెరిగాయి. కనిగిరి నియోజకవర్గంలోనూ ఈ తరహా చేరికలు తెలుగుదేశంలోకి జరిగాయి. అక్కడ ఇన్‌ఛార్జి ఉగ్రనరసింహారెడ్డి కూడా గ్రామాల్లో నేతలతో మాట్లాడి తనవైపు తిప్పుకుంటున్నారు. మరో వైపు శనివారం సిఎస్‌పురంలో 42 కుటుంబాలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరాయి. వైసిపి ఇన్‌ఛార్జి దద్దాల నారాయణ ఆధ్వర్యంలో ఆ పార్టీలో చేరారు. తాజాగా ఒంగోలు పట్టణంలోనూ కొందరు వైశ్యనేతలు ▶ 2లో



ఒంగోలులో వైసిపిలో చేరుతున్న యువకులు (ఫైల్)



ర్యాలీని ప్రారంభిస్తున్న రమాదేవి

క్షయ పట్ల అవగాహన అవసరం

క్షయ నివారణ అధికారి రమాదేవి

ప్రజాశక్తి-బాపట్ల

ప్రజలు క్షయ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలని జిల్లా లెప్రసీ ఎయిడ్స్ క్షయ నివారణ అధికారి డాక్టర్ సి.వి.రమాదేవి అన్నారు. ఆదివారం ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా సందర్భంగా బాపట్ల జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా ఎయిడ్స్, టి.బి లెప్రసీ నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ▶ 2లో



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న పూనాటి ఆంజనేయులు

డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం

లోపలి ▶

కొనింది తక్కువ..బకాయిలు ఎక్కువ..

(మొదటిపేజీ తరువాయి)

నిర్దేశిస్తున్న లక్ష్యం కూడా తగ్గిపోతుంది. ఇలా నిర్దేశించుకున్న లక్ష్యంలో సగం కూడా అమలుకు నోచుకోవడం లేదు. గత ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోలు లక్ష్యం 1,40,000 మెట్రిక్ టన్నులు పెట్టారు. కానీ చివరికి 78 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే కొన్నారు. ఈ ఖరీఫ్‌లో 78 వేల మెట్రిక్ టన్నులనే లక్ష్యంగా పెట్టారు. కానీ 28 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే కొన్నారు. గత రబీలో 98 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనాలని లక్ష్యం పెట్టారు. కానీ 49 వేల మెట్రిక్ టన్నులు కొన్నారు. ఈ రబీలో సాగు నీరు లేక, వర్షాలు కురవక జిల్లాలో వరి సాగు విస్తీర్ణం గణనీయంగా పడిపోయింది. జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 50,348 ఎకరాలు కాగా 15,998 ఎకరాల్లో మాత్రమే వరి సాగయింది. ఈ నేపథ్యంలో రబీ సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోళ్లు ఏప్రిల్ రెండో వారం నుంచి జరపాలని నిర్ణయించారు. ధాన్యం కొనుగోలు లక్ష్యం 30 వేల మెట్రిక్ టన్నులుగా నిర్ణయించారు. కానీ జిల్లా రైతులకు చెల్లించాల్సిన ఖరీఫ్ ధాన్యం కొనుగోలు బకాయిలు రూ.36 కోట్ల వరకు ఉన్న నేపథ్యంలో రైతులు సదరు నగదు కోసం ఆర్‌బికెలు, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రబీ ధాన్యం అమ్ముకొనే కోసం రైతులు ఆర్‌బికెల వద్దకు వస్తారా అనేది సందేహంగానే ఉంది. రైతులకు రావలసిన ధాన్యం కొనుగోలు నగదును రాష్ట్రప్రభుత్వం త్వరితంగా విడుదల చేయాలని కోరుతున్నారు.

జోరుగా ఫిరాయింపుల పర్వం

(మొదటిపేజీ తరువాయి)

తెలుగుదేశంలో చేరారు. వైసిపిలోకి కొందరు తెలుగుదేశం నుంచి చేరికలు ఉన్నాయి. ఒంగోలులో రెండు పార్టీల్లో ఇవి కనిపిస్తున్నాయి. ఎంపీ మాగుంట శిబిరంలోనూ చేరికలు కనిపిస్తున్నాయి. ఆయనతో వైసిపిలో ఉన్న కొందరు నేతలు, అనుచరులు ఇప్పుడు తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారు. అద్దంకి నియోజకవర్గంలో తెలుగుదేశంలోకి భారీగా చేరికలు కొనసాగుతున్నాయి. అక్కడ నిత్యం ఇదే తరహా కార్యక్రమాలు పెరిగాయి. నియోజకవర్గాల్లో ఇవి చర్చగా మారాయి. గ్రామాల్లో బలాబలాలపై ప్రభావం చూపుతాయని భావిస్తున్నారు. ఓటర్లను ప్రభావితం చేసే నేతలకు గాలం వేస్తున్నారు. ఈ తరహా వ్యవహారాలు రెండు పార్టీల్లో కనిపిస్తున్నాయి. పోలింగ్‌కు చాలా సమయం ఉన్నందున అభ్యర్థులు ప్రచారం కన్నా వీటికే ఇప్పుడు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు.

క్షయ పట్ల అవగాహన అవసరం

(మొదటిపేజీ తరువాయి)

ఎన్జీవో హోంలో జరిగిన కార్యక్రమంలో రమాదేవి వైద్య, ఆరోగ్య సిబ్బందిని ఉద్దేశించి.. మాట్లాడారు. క్షయ వ్యాధికి గురైతే ప్రభుత్వ వైద్య, ఆరోగ్య క్షయ విభాగం ఉచితంగా అందించే ఔషధాలను ఆరు నెలల పాటు క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. దీంతో పాటు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. క్షయ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం అందించే పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఏడాదికాలంగా విధుల్లో ఉత్తమ పనితీరు కనబరిచిన సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ సయ్యద్ జానీభాషా, జిల్లా న్యూక్లియర్ వైద్యాధికారి షేక్ సాదిక్, ఇంకొల్లు వైద్యాధికారి అరుణ, జిల్లా ఆశా సూపర్‌వైజర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, జిల్లా లెప్రసీ టి.బి నివారణ సిబ్బంది, జిల్లా విహాన్ ప్రాజెక్ట్ సిబ్బంది, ఆశావర్కర్లు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

కూల్ డ్రింక్ షాప్ దగ్ధం

ప్రజాశక్తి-పుల్లలచెరువు



కాలిపోయిన కూల్ డ్రింక్ షాపు

పుల్లలచెరువు మండలంలోని ఐటీవరం పంచాయతీలో గల రెంటపల్లి గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఆది వారం కూల్ డ్రింక్ షాపు పూర్తిగా దగ్ధమైంది. రామ్ నాయక్‌కు చెందిన కూల్‌డ్రింక్ షాపు నుంచి మంటలు వస్తుం డడంతో కుటుంబమంతా షాపు దగ్గరకు వచ్చారు. అప్పటికే షాపులోని సామాగ్రి అంతా దగ్ధమైంది. తీవ్రంగా నష్టపోయాడు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

వైద్య శిబిరంలో 953 మందికి పరీక్షలు

ప్రజాశక్తి-చీరాల



వైద్య శిబిరానికి హాజరైన ప్రజలు

మండలంలోని వాడరేవు రామానంద ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆశ్రమం ఆవరణలో ఆదివారం ఉచిత షుగరు వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి విశేష స్పందన లభించింది. 953 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వీరందరికీ నెల రోజులకు సరిపడ మందులు ఉచితంగా అందజేశారు. శిబిరానికి హాజరైన వారందరికీ అల్పాహారం, తాగునీరు, ఇతర సహాయక ఏర్పాట్లు చేసినట్లు ఆశ్రమ మేనేజర్ నారాయణం సురేష్ తెలిపారు. మందులతోపాటు ఆహార అలవాట్లు, జీవన విధానం మార్చుకోవాలని సూచించారు. మానసిక ఆందోళన తగ్గించుకోవాలని సూచించారు. జీవన విధానం మార్చుకోవడం ద్వారా షుగరు నియంత్రణలో ఉంచుకోవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా క్యాంప్‌లో హాజరైన వారికి నిర్వాహకులు వాడరేవు స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, చీరాల మహిళా కళాశాల విద్యార్థులు రోగులకు ఆహారం, తాగునీటి వసతులు, సహాయక ఏర్పాట్లు చేశారు. ఈ శిబిరంలో డాక్టర్ ఎం రాజరాజేశ్వరి, డాక్టర్ కమల రాజేశ్వరి, డాక్టర్ లలిత్ ప్రకాష్, డాక్టర్ పేట శ్రీకాంత్, డాక్టర్ సుధాకర్ యాదవ్, డాక్టర్ సూర్యప్రకాష్ వైద్య పరీక్షలు చేశారు. ట్రస్ట్ ఉపాధ్యక్షులు కె కృష్ణారావు, కామేశ్వరరావు, ఎంజి శంకరరావు, కుమార్, ఎ సురేష్, మిత్ర ల్యాబ్ వలి, దుర్గగుడి శీను, గోపాల్, సాయి ఫణి కిషోర్, పలువురు పాల్గొన్నారు.

సచివాలయ ఏఎన్ఎం రాజ్యలక్ష్మి మృతి

ప్రజాశక్తి-చీరాల



రాజ్యలక్ష్మి (ఫైల్)

గవినివారిపాలెం ప్రభుత్వ ఎఎన్ఎం రాజ్యలక్ష్మి(47) హఠాత్తుగా మృతి చెందారు. వివరాల్లోకి వెళితే.. ఈపురుపాలెం గ్రామం సవరపాలెంకు చెందిన బత్తుల రాజ్యలక్ష్మి(47) రెగ్యులర్ ఎఎన్ఎం. ప్రస్తుతం ఆమె గవినివారిపాలెం సచివాలయం-2లో విధులు నిర్వహిస్తున్నారు. ఈమెకు భర్త, ఇరువురు సంతానం. అయితే సుమారు వారం క్రితం పట్టణంలో ఓ ప్రయివేట్ వైద్యశాల ప్రతినిధులు కోవిడ్ సమయంలో విశేషంగా సేవలు అందించిన ఆరోగ్య సిబ్బందికి ఐఎంఎ హాలులో సన్మానాలు ఏర్పాటు చేశారు. అక్కడ ఆమె ఒక్కసారిగా కుప్పకూలి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. దీంతో ఉలిక్కిపడిన అక్కడి వారందరూ ఆమెను కార్యక్రమం నిర్వహిస్తున్న వారి హాస్పిటల్లోనే చేర్చి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం మంగళగిరిలోని ఓ ప్రయివేట్ వైద్యశాలకు తరలించారు. అక్కడ పరీక్షలు చేసి తలలో రక్తం గడ్డకట్టినట్లుగా గుర్తించి చికిత్స ప్రారంభించారు. ఆరోజు నుంచి అపస్మారక స్థితిలో ఉన్న ఆమె శనివారం రాత్రి మృతిచెందారు. ఆదివారం కుటుంబ సభ్యులు నిర్వహించిన ఆమె అంతిమయాత్రలో ఆరోగ్య సిబ్బంది పెద్ద సంఖ్యలో హాజరయి నివాళి అర్పించారు.

రాజ్యాధికారంతోనే సాంఘిక సమానత్వం

ప్రజాశక్తి-సంతనూతలపాడు



అంబేద్కర్‌కు నివాళి అర్పిస్తున్న నాయకులు

రాజ్యాధికారం ద్వారానే దళిత బహుజనులకు సాంఘిక సమానత్వం వస్తుందని ఇండియన్ లేబర్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సుందరం అన్నారు. మండలంలోని మంగ మూరులో ఆదివారం ఐఎల్‌పి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరం మాట్లాడుతూ మనువాద పార్టీల నుంచి రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత దళిత బహుజనులదేనని అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ వ్యతిరేక కార్యక్రమాలను కొనసాగిస్తున్నదన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు, జగన్‌లు బిజెపితో అంటకాగుతున్నారన్నారు. ప్రతినిత్యం దళితులపై దాడులు జరుగుతున్నాయన్నారు. రానున్న ఎన్నికల్లో బిజెపి, టిడిపి, వైసిపి పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలని ఆయన కోరారు. జేపీసీగా ఏర్పడిన దళిత బహుజన పార్టీల అభ్యర్థిగా తాను పోటీ చేస్తున్నట్లు దాసరి సుందరం తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ఓటు వేసి గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఐఎల్‌పి నాయకులు దాసరి సంగీతరావు, కంకణాల యేసు, పి యుగంధర్, కే రాజు, కే లాజరు, జే మల్లికార్జున, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సీఏఏ రాజ్యాంగ విరుద్ధం

ప్రజాశక్తి-కంభం రూరల్



సమావేశంలో పాల్గొన్న నాయకులు

సిఎఎ రాజ్యాంగ విరుద్ధమని, మత ప్రాతిపదికగా ఒక మతాన్ని మినహాయించి పౌరసత్వాన్ని కల్పించడం రాజ్యాంగ ఆశయాలకు భిన్నంగా వ్యవహరించడమేనని జమాతే ఇస్లామీ హింద్ బాధ్యులు ఎస్ఎ రఫీ, పి గౌస్‌ఖాన్, ఆవాజ్ కమిటీతో పాటు పలువురు ముస్లిం పెద్దలు తీవ్రంగా ఖండించారు. రంజాన్ సందర్భంగా నిర్వహించిన ఓ సమావేశంలో వారు మాట్లాడుతూ కులం మతం ఇత్యాది భావనలతో, వ్యక్తిగత నమ్మకాలతో నిమిత్తం లేకుండా ఈ దేశంలో నివసించే వారందరూ భారతీయులుగా ప్రవచిస్తుంటే కొందరిని, ప్రత్యేకించి ఒక మతం వారిని వేరు చేయడం రాజ్యాంగాన్ని అవమానించడమేనని వారు ఖండించారు. బిజెపి ప్రభుత్వం తాము చేస్తున్న అవినీతిని కప్పిపుచ్చుకోవడానికి, ప్రజల దృష్టిని మరల్చడానికి ఇటువంటి కుట్రలు పన్నుతుందని వారు ఆరోపించారు. సిఏఏను అమలు చేసేది లేదని కేరళ ముఖ్యమంత్రి తెలిపారని, అదేవిధంగా మన రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా ప్రకటించాలని వారు కోరారు. సిఎఎ అమలు చేస్తున్న బిజెపితో పొత్తు పెట్టుకున్న వైసిపి, టిడిపిలు ఈ రాష్ట్రంలో సిఎఎ అమలు చేయబోమని ప్రకటించాలని ఆవాజ్ కమిటీ జిల్లా కార్యదర్శి ఎం షంషీర్ బేగ్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో లౌకిక వాదులందరూ ఆ పార్టీలను ఓడిస్తారని హెచ్చరించారు. ఈ సందర్భంగా లౌకిక వాద పరిరక్షణ కోసం అహర్నిశలు సహాయ సహకారాలు అందిస్తున్న కమ్యూనిస్ట్ పార్టీలకు, ప్రత్యేక బులెటిన్‌లు ముద్రిస్తూ ప్రజలలో చైతన్యం పెంచేందుకు ప్రజాశక్తి పత్రిక చేస్తున్న కృషిని పలువురు అభినందించారు. కార్యక్రమంలో ముఫ్తీ యాసిన్ సాహెబ్, రసూల్ బేగ్, అబ్దుల్ కలాం, అసిఫ్‌ఖాన్, చాంద్, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.



బిఎన్ విజయ్‌కుమార్ సమక్షంలో టిడిపిలో చేరిన యువకులు

'బిఎన్' సమక్షంలో

టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని సంతనూతలపాడు, పేర్నమిట్ట గ్రామాలకు చెందిన పలువురు ఆదివారం వైసిపి నుంచి టిడిపిలో చేరారు. ఒంగోలులోని ఎస్ఎన్ పాడు నియోజకవర్గ టిడీపీ అభ్యర్థి బిఎన్ విజయకుమార్ కార్యాలయంలో న్యాయవాది మంగళపూడి ఆదిత్య ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన వైసీపీ 20 కుటుంబాలు, పేర్నమిట్ట 41వ డివిజన్‌లో నూతలపాటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వైసిపికి చెందిన 10 కుటుంబాల వారు బిఎన్ విజయకుమార్ సమక్షంలో టీడీపీలో చేరారు. వీరికి విజయ్ కుమార్ టిడిపి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. రాబోయే ఎన్నికలలో తమ గెలుపునకు కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు మద్దినేని హరిబాబు, యువ నాయకులు బొమ్మాజీ అనిల్, టిడిపి నాయకులు వాసేపల్లి వెంకటేశ్వరరెడ్డి, కరిచేటి శ్రీనివాసరావు, తన్నీరు వెంకటేశ్వర్లు, బత్తుల శ్రీను, తన్నీరు వెంకటరావు, నూతలపాటి మధు, తాటి అనిల్ కుమార్, చిరంజీవి, మండల తెలుగు యువత అధ్యక్షులు ముప్పరాజు శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు కంకణాల గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కస్తూరిబాలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ఆరో తరగతి, ఇంటర్ ఫస్ట్ ఇయర్ బైపీసీలో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థినులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్ తిరుమలాదేవి ఆదివారం తెలిపారు. ఆరో తరగతిలో 40 సీట్లు, ఇంటర్ ఫస్ట్ ఇయర్ (బైపీసీ)లో 40 మందికి సీట్లు ఉన్నాయన్నారు. ఏప్రిల్ 11వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. అనాథలు, బడిబయట పిల్లలు, డ్రాపౌట్స్, పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బీపీఎల్ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ తిరుమలాదేవి సూచించారు. వివరాలకు 9000897873 నెంబరును సంప్రదించాలన్నారు.

రంజాన్ కిట్ల పంపిణీ

ప్రజాశక్తి-కంభం రూరల్

రంజాన్ సందర్భంగా జకాత్‌లో భాగంగా జమాత్ ఏ ఇస్లామీ-హింద్ 110 కిట్స్ పేదవారికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జమాత్ ఏ ఇస్లామి హింద్ అధ్యక్షుడు రఫీ, జమాత్ ఏ ఇస్లామీ హింద్ మాజీ ఉపాధ్యక్షులు గౌస్ ఖాన్, ముఫ్తీ యాసిన్ సాబ్, ఆవాజ్ కమిటీ జిల్లా కార్యదర్శి షంషీర్ బేగ్, ఎస్ఐఒ ఏపీ ఎడ్యుకేషన్ కో-ఆర్డినేటర్ చాంద్‌బాషా, ఆర్‌టిఐ ఏజెంట్ కరిముల్లా (మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్), ఏబి ఫంక్షన్ హాల్ అధినేత అయ్యూబ్ ఖాన్, టీచర్ కలాం పాల్గొన్నారు.

సాగర్ జలాలతో చెరువులు నింపాలి

ఎపి గొర్రెలు, మేకల పెంపకం దారుల సంఘం జిల్లా కార్యదర్శి తోట తిరుపతిరావు

ప్రజాశక్తి - మద్దిపాడు

మండల పరిధిలోని అన్ని చెరువులను సాగర్ జలాలతో నింపి పశువులు, జీవాలను దాహార్తిని తీర్చాలని ఏపీ గొర్రెలు, మేకల పెంపకం దారుల సంఘం జ్రిల్లా కార్యదర్శి తోట తిరుపతిరావు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని మద్దిపాడు, భత్తులవారిపాలెం, ఇనమనమెళ్ళూరు, గోగినేనివారి పాలెం గ్రామాలలో ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా గొర్రెలు, మేకల పెంపకం దార్ల కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తిరుపతిరావు మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాలు సరిగా లేవన్నారు. అందువల్ల సాగర్ నీరు రాకపోవడంతో కుంటలు, చెరువులు ఎండిపోయినట్లు తెలిపారు. జీవాలు, పశువులకు తాగడానికి కనీసం చుక్క నీరు అందుబాటులో


జీవాల పెంపకందారులతో మాట్లాడుతున్న తిరుపదిరావు

లేదన్నారు. అక్కడక్కడ కుంటల్లో ఉన్న మురిగు నీరు తాగి జీవాలు అనేక జబ్బుల బారీన పడుతున్నట్లు తెలిపారు. తాగునీరు, తగినంత మేత లేకపోవడంతో జీవాలను కాపాడుకోవడం కోసం, పెంపకం దారులు కుటుంబాలను వదిలి ఇతర జిల్లాలకు వలస పోతున్నారన్నారు. ఈ నేపథ్యంలో సాగర్ జలాలతో చెరువులన్నింటిని నింపాలన్నారు. తాగునీటి తొట్లు నిర్మించి ట్యాంకర్ల ద్వారా వాటిని నింపి పశువులు, జీవాలను దాహార్తిని తీర్చాలన్నారు. పశుపోషకులకు సబ్సిడీపై గడ్డి, దాణా సరఫరా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఉబ్బా వెంకటేశ్వర్లు, గొర్రెలు,మేకల సహకార సంఘం అధ్యక్షుడు దామా వెంకటేశ్వర్లు, బత్తుల గోపి, బాపట్ల మల్లికార్జున, కోటేశ్వరరావు గంగాధర్, బత్తుల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

ప్రజాశక్తి-సిఎస్.పురం


మహిళలతో మాట్లాడుతున్న దద్దాల నారాయణ యాదవ్

పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని వైసిపి కనిగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దద్దాల నారాయణ్ యాదవ్ తెలిపారు. మండల పరిధిలోని ఉప్పలపాడు, ఆనికాలపల్లి, నల్లమడుగుల సచివాలయాల పరిధిలో ఆదివారం ఇంటింటీ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా దద్దాల మాట్లాడుతూ పేదల సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి మేకల శ్రీనివాసులు యాదవ్, పిడిసిసి చైర్మన్ వైఎం.ప్రసాద్‌రెడ్డి, జడ్‌పిటిసిల సంఘం జిల్లా అధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి, వైసిపి మండల అధ్యక్షుడు భువనగిరి వెంకటయ్య, వైస్ ఎంపిపిలు దుగ్గిరెడ్డి ప్రతాపరెడ్డి, భూమిరెడ్డి, ప్రభంజన వెంకటరెడ్డి, సర్పంచులు ప్రవీణ్‌కుమార్, రాధాకష్ణారెడ్డి, ముత్యాల భారతీ, నారాయణరెడ్డి, పాలుగుల్ల మల్లికార్జునరెడ్డి, ఎంపిటిసిలు ముడుమాల నారాయణరెడ్డి, వైసిపి యూత్ మండల అధ్యక్షుడు బొర్రాజ రమణయ్య, మిరియం వెంకటేశ్వర్లు, దుగ్గిరెడ్డి జయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలపై ప్రజలకు అవగాహన

ప్రజాశక్తి-హనుమంతుని పాడు

సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలు సహకరించాలని ఎస్ఐ పులి శివ నాగరాజు కోరారు. మండల పరిధిలోని హాజీపురం, కిష్టంపల్లి, దొడ్డిచింతల, సీతారాంపురం, కూటా గుండ్ల గ్రామాలలో ఆదివారం ఎస్ఐ పర్యటించారు. ఈ సందర్భంగా సార్వత్రిక ఎన్నికలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ప్రజలు తగాదాలు, ఘర్షణలకు దూరంగా ఉండాలన్నారు. ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్నేహపూర్వక వాతా వరణంలో ఎన్నికలు జరిగేలా అందరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'దద్దాల' ప్రత్యేక పూజలు

సిఎస్.పురం : సిఎస్.పురంలోని డీజీపేట రోడ్‌లో నూతనంగా నిర్మించిన గంగమ్మ తల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా హోమాలు, ప్రత్యేక పూజలు, అమ్మవారి గ్రామోత్సవం, సాంస్కతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి కనిగిరి నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దద్దాల నారాయణ అమ్మవారికి దర్శించుకొని ప్రత్యేక నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు దద్దాల నారాయణను శాలువాతో సత్కరించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

మండల పరిధిలోని వేములపాడు గ్రామంలో టిడిపి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి, కస్టర్ ఇన్‌ఛార్జి గాయం తిరుపతిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మురహరి నరసయ్య, కుందురు నారాయణరెడ్డి, దోసపాటి బ్రహ్మం గౌడ్, గాయం రామిరెడ్డి, చీకటి వెంకటసుబ్బయ్య, దేవిరెడ్డి రాజారామిరెడ్డి, కోటపాటి శేషయ్య, తాతపూడి బుజ్జి, మాశపోగు ఎర్రయ్య, పగడాల శ్రీరాములు రెడ్డి, పోతులూరి వీరాచారి, దోసపాటి శివకుమారి, మల్లెల తిరపతయ్య, ముక్కు వెంకటేశ్వర రెడ్డి, చెన్నయ్య, వెంకటేశ్వర్లు, బూచి కోటిరెడ్డి, నాగేందర్ రెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగులతో ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

అందరి సహకారంతో యర్రగొండపాలెం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు తెలిపారు. ఉద్యోగ రీత్యా హైదరాబాదులో నివాసం ఉంటున్న యర్రగొండపాలెంకు చెందిన వారితో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ వైసిపి రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు జివి.రెడ్డి, పొడపాటి తేజస్వి, తిరునగరి జ్యోత్స్న, రాయపాటి అరుణ, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పాకనాటి గౌతమ్ రాజ్, ఎనుముల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-శింగరాయకొండ

ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని సోమరాజుపల్లి గ్రామంలో మదర్ లాండ్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. మదర్ లాండ్ సొసైటీ ప్రాజెక్ట్ మేనేజర్ ఎస్‌కె.సంధాని బాషా మాట్లాడుతూ వయస్సు, లింగ, పేద, ధనిక సంబంధం లేకుండా క్షయ వ్యాధి ప్రతి సంవత్సరం కొన్ని లక్షల మంది ప్రజలను ప్రభావితం చేస్తుంది. ప్రపంచంలోనే భారతదేశంపై క్షయ భారం అత్యధికంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జి.రాంబాబు, ఎఎన్ ఎం.దివ్యనాగమణి, వెంకట్రావు, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు : క్షయవ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని హెల్ఫ్ టిఐ ఎం.మల్లేశ్వరి తెలిపారు. క్షయవ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని మద్దిరాలపాడు గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా మల్లేశ్వరి మాట్లాడుతూ క్షయవ్యాధి అంటువ్యాధి కాదని, గాలి ద్వారా ప్రక్కవారికి వ్యాధి చెందుతుందన్నారు. క్షయవ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ కషి చేయాలన్నారు ఈ కార్యక్రమంలో ఎఎన్‌ఎం జె.రాధ, వెంకటేశ్వర్లు, సుభాషిణి, నాగలక్షి పాల్గొన్నారు.

పెద్దదోర్నాల : ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా పెద్ద దోర్నాలలోని కమ్యూనిటీ హెల్త్



ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

సెంటర్‌లో అవగాహన సందస్సు నిర్వహించారు. తొలుత ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యశాల సూపరింటిండెంట్ డాక్టర్ నాగమహేశ్వరీ మాట్లాడుతూ క్షయవ్యాధి అంటువ్యాధి అని తెలిపారు. ఇది గాలి ద్వారా ఒకరి నుండి మరొకరికి సోకుతుందన్నారు. ఎక్కువకాలం దగ్గు ఉండడం, బరువు తగ్గటం, గళ్ళ పడటం, 10 రోజులకు మించి జ్వారం రావడం లాంటి లక్షణాలు ఉంటే వెంటనే పరీక్ష చేయించుకోవాలన్నారు. అనంతరం టీబీ వ్యాధిగ్రస్తులకు న్యూట్రిషన్ ఫుడ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీబీ మండల కోర్డినేటర్ వెంకటరమణ, డాక్టర్ వైద్య సంజీవ్, డాక్టర్ లావణ్య, డాక్టర్ కలసంధ్య, ఆరోగ్య మిత్రులు మందగిరి చంద్రశేఖర్, సాంబయ్య, హెడ్‌నర్స్ హెలిజబెత్, స్టాఫ్ నర్సులు మేరీబాయ్, నిర్మల, సుస్మా, తదితరులు పాల్గొన్నారు.

కూల్ డ్రింక్ షాపు దగ్ధం

ప్రజాశక్తి-పుల్లలచెరువు

పుల్లలచెరువు మండలం ఐటీవరం పంచాయతీలోని రెంటపల్లి గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఆదివారం ఓ కూల్ డ్రింక్ షాపు దగ్ధమైంది. రామ్ నాయక్‌కు చెందిన కూల్‌డ్రింక్ షాపు నుంచి మంటలు వస్తుండడంతో గమనించి ఆర్పేందుకు ప్రయత్నించారు. అప్పటికే షాపులోని సామగ్రి అంతా దగ్ధమైంది.

దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ఆరో తరగతి, ఇంటర్ ఫస్ట్ ఇయర్ బైపీసీ విభాగంలో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థినులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపల్ ఎస్ తిరుమలాదేవి తెలిపారు. ఆరో తరగతిలో 40 సీట్లు, ఇంటర్ ఫస్ట్ ఇయర్ (బైపీసీ)లో 40 మందికి సీట్లు ఉన్నాయన్నారు. ఆసక్తి కలిగిన వారు ఏప్రిల్ 11 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9000897873 సెల్ నంబరును సంప్రదించాలన్నారు.

పోలీసు కవాతు

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని డిఎస్‌పి రామరాజు తెలిపారు. హనుమంతునిపాడులో కేంద్ర సాయుధ బలగాలు, పోలీసు సిబ్బంది ఆధివారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూఎన్నికల నేపథ్యంలో స్వేచ్ఛాయుత ఓటింగ్‌పై ప్రజలకు భరోసా కల్పించేందుకు కవాతు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ వెంకటేశ్వరావు,ఎస్ఐ శివ నాగరాజు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యులకు అగాహన

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ప్రజలకు అధునాతన పద్ధతుల ద్వారా వైద్య సేవలు అందిస్తున్నట్లు డాక్టర్ రామచంద్రారెడ్డి తెలిపారు. నరసరావుపేటకు చెందిన మాతాశ్రీ హాస్పటల్ ఆధ్వర్యంలో ముస్లిం షాదీఖానాలో యర్రగొండపాలెం ఏరియా గ్రామీణ వైద్యులకు వ్యాధుల పట్ల అవగాహన సదస్సు ఆదివారం నిర్వహించారు. కడుపు నొప్పి, హెర్నియా, సుంతి తదితర శస్త్రచికిత్సలను చేసే విధానాన్ని వివరించారు. అలాగే గ్యాస్ట్రబుల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. గ్యాస్ట్రబుల్ ఉన్న వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ ఈ కార్యక్రమంలో మాతాశ్రీ హాస్పటల్ ఎమ్‌డి సుబ్బారెడ్డి, గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జాషువ, మల్లికార్జునరావు, కోశాధికారి ఇస్మాయిల్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సౌమ్య ప్రియదర్శినికి ఉత్తమ అవార్డు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రరగొండపాలెంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో టిబి సూపర్ వైజర్‌గా పని చేస్తున్న కె.సౌమ్య ప్రియదర్శినికి ఉత్తమ అవార్డు అందజేశారు. ప్రపంచ క్షయ దినోత్సవం సందర్భంగా ఒంగోలులో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టిబీ ఆఫీసర్ డాక్టర్ డి.సురేష్ కుమార్ చేతులు మీదుగా ఆదివారం సౌమ్య ప్రియదర్శిని బెస్ట్ అవార్డుతో పాటు ప్రశంసా పత్రం అందుకున్నారు. ఈ సందర్భ:గా యర్రగొండపాలెం ఏరియా వైద్యశాల వైద్యులు, సిబ్బంది సౌమ్య ప్రియదర్శినికి దనలు తెలిపారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి-సిఎస్.పురం

మండల పరిధిలోని ఉప్పలపాడు ఎస్‌టి కాలనీ వాసులు తాగునీటి కోసం అనేక ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ఆ సమస్యను పరిష్కరించాలని సిపిఐ నాయకుడు పెద్దమస్తాన్ కోరారు. కాలనీలో ఉన్న చేతి పంపు నుంచి నీరు సక్రమంగా రావడదం లేదని తెలిపారు. దీంతో కాలనీ వాసులు నీటి కోసం అనేక అవస్థలు పడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు.

28న బార్ అసోసియేషన్ ఎన్నిక

ప్రజాశక్తి - బాపట్ల


బెజ్జం వెంకటేశ్వర్లు

బార్ అసోసియేషన్ 2024-25 ఎన్నికలు ఈనెల 28న జిల్లా కోర్టులో జరుగుతాయని ఎన్నికల అధికారి బెజ్జం వెంకటేశ్వర్లు తెలిపారు. ఈపాటికే వైస్ ప్రెసిడెంట్‌గా జి సువర్ణ నాగమోహిని, జాయింట్ సెక్రటరీగా కట్టా కోర్నేలియా, కోశాధికారిగా ఎటి నటరాజన్, లైబ్రేరియన్‌గా సి ప్రేమచంద్, మహిళా రిప్రజెంటేటివ్‌గా కె నాగలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారని తెలిపారు. ఎన్నికలకు న్యాయ వాదులు తప్పనిసరిగా రాష్ట్ర బార్ కౌన్సిల్ జారీ చేసిన గుర్తింపు కార్డు తీసుకురావాలని సూచించారు. ఎన్నికలకు సహాయకులుగా గోన కిశోర్, అకిశెట్టి మాధురి వ్యవహరిస్తారని తెలిపారు.


మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆనంద్ బాబు

ఆనందబాబు పరామర్శ

ప్రజాశక్తి - వేమూరు

వైసిపి నాయకుల ఆగడాలు మితి మిరిపోతున్నయని, వాటికి టిడిపి కార్యకర్తలు అధైర్య పడవద్దని మాజీమంత్రి నక్కా ఆనందబాబు అన్నారు. ఎన్నికల నిబంధనలు అమలులో ఉండగా టిడిపి ఫ్లెక్సీలు తొలగించారు కానీ వైసీపీ ఫ్లెక్సీలు ఎందుకు తొలగించలేదని అడిగినందుకు కొల్లూరు మండలం కిష్కిందపాలెం గ్రామానికి చెందిన కొల్లి వెంకటేశ్వర్రావును సర్పంచ్ కలిసి వైసిపి నాయకులు దాడి చేయగా గాయాలతో చికిత్స పొందుతున్న వెంకటేశ్వర రావును ఆదివారం పరామర్శించారు. ఫ్లెక్సీని ఎందుకు తొలగించలేదని అడిగినందుకే వెంకటేశ్వరరావుపై దాడి చేయటం హేయమైన చర్యని అన్నారు. గ్రామాల్లో కులాల మధ్య చిచ్చు పెట్టేందుకు వైసిపి కోరుకుందని, అలాంటి అంశాలను టిడిపి కార్యకర్తలు గుర్తించాలని కోరారు. అధికారం శాశ్వతం కాదని వైసిపి నేతలను ఆయన హెచ్చరించారు. ఆయన వెంట టిడిపి నాయకులు కనగల మధుసూదన్ ప్రసాద్, మైనేని మురళీకృష్ణ ఉన్నారు.


దాసరిపాలెం ప్రచారంలో అశోక్‌బాబు

అశోక్‌బాబు ప్రచారం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

వైసిపి అభ్యర్థి వరికూటి అశోక్ బాబు ఆదివారం భట్టిప్రోలులో విస్తృత ప్రచారం చేశారు. మండలంలోని గొరిగపూడి, ఒలేరు తదితర గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు కొనసాగటానికి, రాష్ట్ర అభివృద్ధికి వైసిపిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గొరిగపూడి సర్పంచ్ గరికపాటి మల్లిక, మాజీ ఎంపిటిసి వెంకటేశ్వరరావు, ఎంపీపీ డివి లలిత కుమారి, జడ్పీటిసి టి ఉదయ్ భాస్కర్ పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం

ప్రజాశక్తి - బాపట్ల

జిల్లా ప్రత్యేక ఎన్ ఫోర్స్ మెంట్ అధికారి, అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (అడ్మిన్) ఆదేశాల మేరకు భర్తిపూడి గ్రామంలో నిర్వహించిన దాడుల్లో పులి శివయ్య, కాకుమాను నాగ పూర్ణచందు అక్రమంగా నిల్వ ఉంచిన 46 క్వార్టర్ బాటిళ్లు, హీరో ఫ్యాషన్ ప్రో ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మరో నిందితుడు పరారైనట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

హక్కులు హరిస్తున్న మోడీ ప్రభుత్వాన్ని ఓడించాలి

సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు

ప్రజాశక్తి - మార్కాపురం

కార్మిక హక్కులు హరిస్తూ జాతి సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతున్న కార్మిక వ్యతిరేక నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని ఓడించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు కార్మికులను కోరారు. స్థానిక ప్రైవేటు విద్యా సంస్థ నందు సిఐటియు జిల్లా శిక్షణ తరగతులను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి ప్రజల పన్నులచే నిర్మించబడిన జాతి సంపదైన ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పే మోడీ విధానాన్ని ఆయన ఖండించారు. కార్మిక హక్కులను హరిస్తూ ఉన్న ఉపాధిని దెబ్బతీసే చర్యలను నరేంద్ర మోడీ ప్రభుత్వం అవలంబిస్తుందని అన్నారు. ప్రజలపై భారాల మోపుతున్నారని అన్నారు. భారాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రజల మధ్య మత వైశ్యామ్యాలు, మత ఉన్మాద చర్యలను చేపడుతుందని ఆరోపించారు. ప్రభుత్వ స్కీమ్‌లకు బడ్జెట్లో నిధులు కేటాయించకుండా మొండి చేయి చూపించిందని అన్నారు. ఫలితంగా పథకాల్లో పనిచేస్తున్న స్కీం కార్మికులకు కనీస వేతనాలు చెల్లించకుండా వెట్టి చాకిరి చేయించుకుంటుందని అన్నారు. రాష్ట్రంలోని జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన మాట తప్పిందని అన్నారు. పెరిగిన ధరలను తగ్గించి ప్రజలకు అందుబాటులో ఉంచుతానని, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులందరినీ రెగ్యులర్ చేస్తానని, స్కీం వర్కర్లకు వేతనాలను పెంచుతానని, సిపిఎస్‌ను రద్దు చేస్తానని, ప్రతి ఏటా డీఎస్సీ ప్రకటిస్తానని ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకపోగా హామీల అమలు కోసం పోరాడుతున్న కార్మికుల గొంతు నొక్కే చర్యలకు పూనుకున్నదని అన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం కార్మిక, ఉద్యోగ, రైతు వ్యతిరేక ప్రభుత్వమని అన్నారు. క్లాసులకు ప్రిన్సిపల్‌గా పట్టణ కార్యదర్శి పి రుబెన్ వ్యవహరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి డీకెఎం రఫీ, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె సుబ్బరాయుడు, మిడ్ డే మీల్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు టి గురునాథం, జె నాగరాజు, సుబ్బలక్ష్మి, రామిరెడ్డి, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు జె రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాలం సుబ్బారావు

భగత్‌సింగ్ స్ఫూర్తితో హక్కుల కోసం పోరాడాలి

ప్రజాశక్తి - మార్కాపురం

పరాయి పాలన నుండి దేశం విముక్తి చెందాలని, ప్రకృతి వనరులన్నీ ప్రజల పరం కావాలని అశేష త్యాగాలు చేసిన స్వాతంత్ర సమరయోధుల ఆశయాలను నేటి పాలకులు తుంగలో తొక్కుతున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు ఆరోపించారు. మండలంలోని కందివారిపల్లెలో సర్దార్ భగత్ సింగ్ వర్ధంతి సభలో మాట్లాడారు. బంగారం పండే భూములు, చావులేరుగని జీవనదులు, అపారమైన గనులు, ఖనిజ సంపద, అడవులతో కూడిన ప్రకృతి వనరులకు భారతదేశం నిలయంగా ఉందని అన్నారు. పరాయి పాలన పోతే ఈ వనరున్నిటిని ప్రజల పరం చేసుకోవచ్చని, ఆకలి చావులు, ఆత్మహత్యలు, నిరుద్యోగం, అధిక ధరలు, అక్రమాలు లేని ప్రశాంతమైన, సౌభాగ్యవంతమైన దేశంగా విలసిల్ల వచ్చని భగత్ సింగ్ లాంటి యువకిశోరాలు తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారని అన్నారు. స్వాతంత్రం వచ్చిన తర్వాత కూడా ఆ సమరయోధుల లక్ష్యాలు నెరవేరలేదని అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమానికి ద్రోహం చేసి, పరాయి పాలకులకు వంత పాడిన వాళ్ళు గత పదేళ్లుగా అధికారంలో ఉండటం అత్యంత విషాదకరమని అన్నారు. పోరాటాలు, త్యాగాలతో సాధించుకున్న హక్కులు, చట్టాలను బిజెపి హరించి వేస్తున్నదని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను, వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు అప్పజెప్పున్నారని అన్నారు. భగత్ సింగ్ లాంటి యువకిశోరాలు మతసామరస్యాన్ని కోరుకుంటే నేటి పాలకులు మత ఉన్మాదాన్ని రెచ్చగొడుతున్నారని అన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా కార్మిక, కర్షకులు పెద్ద ఎత్తున పోరాడుతున్నారని, అటువంటి పోరాటాలే ఈ దేశానికి రక్షణకల్పిస్తాయని అన్నారు. భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా స్వాతంత్ర్య పోరాట అమరుల స్ఫూర్తిని మనసంతా నింపుకొని వారి ఆశయాల సాధన కోసం ఉద్యమించాలని కోరారు. సభకు గుమ్మా బాలనాగయ్య అధ్యక్షత వహించారు. నాటి యువత నిస్వార్థంగా దేశం కోసం పోరాడి, ప్రాణాలర్పిస్తే బ్రిటిష్ పాలన పోయిందని అన్నారు. నేటి యువతరం అటువంటి పోరాటాల్లోకి రాకుండా పాలక పార్టీలు మద్యం, మత్తు మందులకు బానిసలుగా మారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగం పెరిగి, బ్రతుకుదెరువు లేక అరాచకం వైపు యువత కొట్టుకుపోయే ప్రమాదం ఏర్పడిందని అన్నారు. ఇలాంటి స్థితిలో భగత్ సింగ్ జీవితం, ఆదర్శం, ఆయన త్యాగపూరిత జీవితం యువతకు స్ఫూర్తిదాయకం కావాలని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు తురక ఏడుకొండలు, నాయకులు నాగరాజు, ఎం బాలశేషయ్య, మున్నంగి రమేష్, బుదాల జాన్‌బాబు, మురికిపూడి చెన్నయ్య, ఎం సుబ్బయ్య పాల్గొన్నారు.


భగత్‌సింగ్‌కు నివాళి అర్పిస్తున్న కంకణాల ఆంజనేయులు

కంకటపాలెంలో పోలీసుల కవాతు


కవాతు నిర్వహిస్తున్న సిఐ హజరత్ బాబు

ప్రజాశక్తి - బాపట్ల

ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాలైన కంకటపాలెం, జమ్ములపాలెం గ్రామాల్లో సిఐ జి హజరత్ బాబు ఆధ్వర్యంలో కేంద్ర సాయుధ బలగాలతో ఆదివారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ హజరత్ బాబు మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ప్రజల సహకరించాలని కోరారు. వివాదాలు జోలికి వెళితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కారంచేడు : మండలంలోని కారంచేడు గ్రామంలో పోలీసు బలగాలు ఆదివారం కవాతు నిర్వహించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రత పరిరక్షణ కోసం కవాతు నిర్వహిస్తున్నట్లు ఇంకొల్లు సీఐ శ్రీనివాసరావు తెలిపారు. గ్రామాల్లో వివాదాలు చేస్తే అటువంటి వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రత్యేక బలగాలతో పాటు కారంచేడు ఎఎస్ఐ మధుబాబు, హెడ్ కానిస్టేబుల్ వి బ్రహ్మానందం పాల్గొన్నారు.


కారంచేడులో పోలీసు బలగాల కవాతు


కాలిపోయిన ఇంటిని పరిశీలిస్తున్న బాలాజి

బాధిత కుటుంబానికి భరోసా

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలోని దేవరపల్లి గ్రామానికి చెందిన వైసిపి నాయకులు జూపూడి రోశయ్య నివాసం అగ్ని ప్రమాదంలో కాలిపోయింది. అతని ఇంటిని పరిశీలించి కుటుంబ సభ్యులను వైసిపి అభ్యర్థి యడం బాలాజీ ఆదివారం పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు.


వాహన తనిఖీ చేస్తున్న పోలీసులు దృశ్యం

రూ.50 వేలకు మించితే పత్రాలు తప్పనిసరి

ప్రజాశక్తి - మార్కాపురం రూరల్

ఎన్నికల నిబంధనలు అమలులోకి వచ్చిన నేపథ్యంలో నగదు రవాణాపై నిఘా పెరిగింది. ఓటర్లకు డబ్బు, మద్యం, ఇతర వస్తువులు పంపిణీ చేసి ప్రలోభాలకు గురిచేస్తారన్న ఉద్దేశంతో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలీసులు, రెవెన్యూ అధికారులు ముమ్మర తనిఖీలు చేస్తున్నారు. ఈనెల 16 నుంచి జూన్ 5వరకు ఎన్నికల నిబంధనలు అమలులో ఉండ నున్న నేపథ్యంలో ఎన్నికల నియమావళిపై అందరూ అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉంది. సరైన ఆధార పత్రాలు లేకుండా రూ.50వేల కన్నా ఎక్కువ నగదు తీసుకెళితే ఎన్నికల అధికారులు జప్తు చేసి కేసు నమోదు చేసి కోర్టుకు అప్పగిస్తారు. రూ.50వేలకు మించి నగదు, రూ.10వేల విలువకు మించిన వస్తువులు రవాణా చేయడం నిషిద్ధమని అధికారులు తెలిపారు. పార్టీల స్టార్ క్యాంపెయినర్ల వద్ద రూ.లక్షకు మించి నగదు ఉండకూడదని తెలిపారు. డబ్బు ఎవరికి చెల్లించేందుకు తీసుకెళ్తున్నారో ఇన్వాయిస్ పత్రం తప్పనిసరని తెలిపారు. ఉద్యోగులు, కార్మికులు, కూలీలకు సంబంధించి వేతనాల చెల్లింపునకు నగదు తీసుకెళ్తుంటే వారి జాబితా, డ్రా చేసిన రసీదు వివరాలుండాలని తెలిపారు. ఆసుపత్రులకు చెల్లించేందుకు డబ్బు తీసుకెళ్తుంటే సంబంధిత నివేదికలు, రోగి వివరాలు ఉండాలని తెలిపారు. రైతులు ఏవైనా కొనుగోలుకు తీసుకెళ్తున్నట్లయితే వ్యాపార సంస్థల నుంచి ఇన్వాయిస్ లేదా కొటేషన్స్ తీసుకుంటే మంచిదని తెలిపారు. భూములు, స్థలాలకు సంబంధించిన లావాదేవీలైతే దస్తావేజులు, మీసేవా కేంద్రాల్లో నమోదు చేసుకున్న స్లాట్ వివరాలు ఉండాలని తెలిపారు.


భోజనం వడ్డిస్తున్న నరేంద్రవర్మ

వెదుళ్లపల్లిలో ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి - బాపట్ల

మండలంలోని వెదుళ్ళపల్లి అక్స ఏ మసీద్ ముస్లిం యూత్, మసీద్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన రంజాన్ ఇఫ్తార్ విందులో టిడిపి కూటమి అభ్యర్థి నరేంద్ర వర్మ పాల్గొన్నారు. రంజాన్ ఇఫ్తార్ విందులో పాల్గొనడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ముక్కాముల శివ, గుడిపల్లి సాంబయ్య, ఫరీద్, మీరవాలి, చాంద్ భాష పాల్గొన్నారు.

పోటాపోటీగా ఎమ్మెల్యే అభ్యర్థుల పూజలు

హస్తినాపురం గుడికి వెంకటేష్, కొండయ్య ● అనుచరులతో విడివిడిగా హాజరు

ప్రజాశక్తి-చీరాల

నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థులుగా ఆయా పార్టీల అధిష్టానాలు ప్రకటించిన నేపథ్యంలో నియోజకవర్గంలో వైసీపీ, టిడిపి అభ్యర్థులు ఇద్దరూ వారి వారి శైలిలో పోటాపోటీగా ప్రచారాలు చేస్తున్నారు. ముఖ్య నేతలను, ప్రజలను కలుస్తూ వారితో మమేకం అయ్యేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే ఆదివారం చీరాల మండలం హస్తినాపురంలో గణపతి స్వామివారి ముఖద్వార మండప ప్రారంభోత్సవ కార్యక్రమానికి వైసీపీ, టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థులను కమిటీ నిర్వాహకులు ఆహ్వానించగా అభ్యర్థులు ఇద్దరూ వారి అనుచరులతో విడివిడిగా పూజా కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ నేపథ్యంలో గణపతి స్వామి ముఖ మండపం ప్రారంభోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తాజా మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైసీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కరణం వెంకటేష్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట కార్యక్రమంలో అర్బన్ ఫైనాన్స్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, పార్టీ అధ్యక్షులు ఆసాది అంకలరెడ్డి, మాజీ జెడ్పీటీసీ పృథ్వీ అరుణ, పృథ్వీ ధనంజయ, పృథ్వీ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. అనంతరం కొంత సమయానికి కమిటీ ఆహ్వానంతో అదే దేవాలయంలో గణపతి స్వామి వారి ముఖ మండపం ప్రారంభోత్సవంలో భాగంగా టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎం కొండయ్య కుడా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆయన వెంట టిడిపి నాయకులు సజ్జా వెంకటేశ్వరరావు, సిద్ధి బుచ్చేశ్వరరావు, పృథ్వీ లలిత మోహన్, సజ్జా రేణుకేశ్వరరావు, సజ్జా బాలానందం, ఆసాది వీర్లంకారెడ్డి, గంజి పురుషోత్తం, బొగ్గుల పార్థసారథి, వంకా హరికృష్ణ తదితర నాయకులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా అభ్యర్థులు ఇద్దరూ ఒకే ఆలయంలో వెంటవెంటనే పూజల్లో పాల్గొనగా నియోజకవర్గంలో ఎన్నికల వాతావరణం వేగం పుంజుకున్నట్లుగా ఉంది అని ప్రజలు చర్చించుకుంటున్నారు.



హస్తినాపురంలో పూజల్లో బాలరామకృష్ణమూర్తి, ఎమ్మెల్యే అభ్యర్థి కరణం వెంకటేష్



హస్తినాపురం పూజల్లో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎం కొండయ్య

అధునాతన విధానాల ద్వారా వైద్య సేవలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

అధునాతన విధానాల ద్వారా వైద్య సేవలు అందిస్తున్నట్లు డాక్టర్ పి రామ చంద్రారెడ్డి తెలిపారు. ఆదివారం నరసరావు పేటకు చెందిన మాతాశ్రీ హాస్పటల్ ఆధ్వర్యంలో యర్రగొండపాలెంలోని ముస్లిం షాదీఖానాలో యర్రగొండపాలెం ఏరియా గ్రామీణ వైద్యులకు వ్యాధుల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కడుపు నొప్పి, హెర్నియా, సుంతి తదితర శస్త్ర చికిత్సలను చేసే విధానాన్ని వివరించారు. అలాగే గ్యాస్ట్రబుల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. గ్యాస్ట్రబుల్ ఉన్న వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఇంకా మాతాశ్రీ హాస్పటల్ ఎండి సుబ్బారెడ్డి, యర్రగొండపాలెం ఏరియా గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి జాషువ, యు మల్లికార్జునరావు, కోశాధికారి పి ఇస్మాయిల్ ఖాన్ మాట్లాడారు. అనంతరం ఏయే వ్యాధులకు లాప్రోస్కోపి ద్వారా శస్త్రచికిత్సలు ఏ విధంగా చేస్తారు అనే దానిని ప్రొజెక్టర్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో యర్రగొండ పాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం మండలాలకు చెందిన గ్రామీణ వైద్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ పి రామచంద్రారెడ్డి

వైపాలెంను అభివృద్ధి చేస్తా: ఎరిక్షన్‌బాబు



మాట్లాడుతున్న టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎరిక్షన్‌బాబు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మీ అందరి సహకారంతో యర్రగొండపాలెం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని యర్రగొండపాలెం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. ఆదివారం యర్రగొండపాలెం నియోజకవర్గం నుంచి హైదరాబాదు వెళ్లి ఉద్యోగ రీత్యా హైదరాబాదులో నివాసం ఉంటున్న వారితో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిందని తెలిపారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టిడిపి అధికారంలోకి రావాలన్నారు. జరుగనున్న సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకొని మీరంతా వచ్చి టిడిపిని గెలిపించేందుకు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇంకా టిడిపి నాయకులు జీవీ రెడ్డి, పొడపాటి తేజస్వి, తిరునగరి జ్యోత్స్న, రాయపాటి అరుణ, నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి పాకనాటి గౌతమ్ రాజ్, ఎనుముల నాగేశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యర్రగొండపాలెం నియో జకవర్గం నుంచి హైదరాబాదులో ఉంటూ వివిధ రకాల ఉద్యోగాలు చేసుకుంటున్న 2,500 మంది ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం ర్యాలీ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెంలోని ది లేమెన్స్ ఇవాంజలికల్ ఫెలోషిప్ చర్చి ఆధ్వర్యంలో మట్టల ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దైవజనులు హయ్యర్ జయదేవ్ మాట్లాడుతూ మనవాళి పాపపరిహారార్థం దేవుడే మానవుడిగా దిగివచ్చి తన్ను తాను బలిపశువుగా సిలువపై తన ప్రాణాన్ని అర్పించారని, దాన్నే గుడ్ ఫ్రైడే అంటారని తెలిపారు. ముందుగా యర్రగొండ పాలెంలోని ప్రధాన వీధులలో ప్ల కార్డులు ప్రదర్శించి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు గుమ్మా రాజయ్య, సంఘస్తులు ఇస్సాకు, శ్రీను, బాబు, సాగర్, నతానియేల్, జాన్ విక్టర్, వెంకటమ్మ, రూతు, విజయమ్మ, శిరీష, యేసుదయమ్మ తదితరులు పాల్గొన్నారు.




యురాలజీ హెల్త్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న కరణం బలరాం

క్షయ వ్యాధి నివారణ దినోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్ద దోర్నాల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో వరల్డ్ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా ఆదివారం అవగాహన సందస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యశాల సూపరింటిండెంట్ డాక్టర్ నాగమహేశ్వరి మాట్లాడుతూ క్షయవ్యాధి అంటువ్యాధి అని తెలిపారు. ఇది గాలి ద్వారా ఒకరి నుండి మరొకరికి సోకుతుందని చెప్పారు. ఎక్కువకాలం దగ్గు ఉండడం, బరువు తగ్గటం, గళ్ళ పడటం, 10 రోజులకు మించి జ్వారం రావడం లాంటివి ఉంటే వెంటనే పరీక్ష చేయించుకోవాలన్నారు. టీబీ వ్యాధిగ్రస్థులకు న్యూట్రిషన్ ఫుడ్ పంపిణీ చేశారగీ కార్యక్రమంలో టీబీ మండల కోర్డినేటర్ వెంకటరమణ, డాక్టర్ వైద్యసంజీవ్, డాక్టర్ లావణ్య, డాక్టర్ కలసంధ్య, ఆరోగ్య మిత్రలు మందగిరి చంద్రశేఖర్, సాంబయ్య, హెడ్‌నర్స్ హెలిజబెత్, స్టాఫ్ నర్సులు మేరీబాయ్, నిర్మల, సుస్మా తదితరులు పాల్గొన్నారు.



పౌష్టికాహారం అందజేస్తున్న దృశ్యం

హైమా హాస్పిటల్లో యూరాలజీ హెల్త్ కేర్ సర్వీసెస్

ప్రజాశక్తి-చీరాల

కార్పొరేట్ వైద్యాన్ని అతి తక్కువ ఖర్చుతో అందిస్తూ ప్రజల మన్నలను పొందుతున్న హైమా హాస్పిటల్ అధినేత డాక్టర్ హైమా సుబ్బారావు సేవలు అభినందనీయమని అన్నారు. ఆదివారం హైమా హాస్పిటల్‌లో డాక్టర్ గుంటుపల్లి సుబ్బారావు నూతనంగా ఏర్పాటు యూరాలజీ హెల్త్ కేర్ సర్వీసెస్‌లను తాజా మాజీ ఎమ్మెల్యే కరణం బలరామ కృష్ణమూర్తి, చీరాల వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కరణం వెంకటేష్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైమా హాస్పిటల్లో ప్రజలకు అందుబాటులో యూరాలజీ హెల్త్ కేర్ సర్వీసెస్ సేవలు ఏర్పాటు చెయ్యటం అభినందనీయమని అన్నారు. ప్రజలకు మరింతగా సేవలు అందిస్తూ అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గోరంట్ల సుబ్బారావు, అర్బన్ ఫైనాన్స్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, పార్టీ అధ్యక్షులు ఆసాది అంకాలరెడ్డి, దివి జయరావు, గోలి నాగరాజు, గుంటూరు వెంకట సుబ్బారావు, పృథ్వీ ధనంజయ, అందే సుబ్బారాయుడు, చప్పిడి రామచంద్రరావు తదితర నాయకులు పాల్గొన్నారు.



బెస్ట్ అవార్డు అందుకుంటున్న సౌమ్య ప్రియదర్శిని

సౌమ్య ప్రియదర్శినికి బెస్ట్ అవార్డు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో టిబీ సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న కె సౌమ్య ప్రియదర్శినికి బెస్ట్ అవార్డు అందజేశారు. ఆదివారం ప్రపంచ క్షయ దినోత్సవం సందర్భంగా ఒంగోలులో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టిబీ ఆఫీసర్ డాక్టర్ డి సురేష్ కుమార్ చేతులు మీదుగా ఆమె బెస్ట్ అవార్డుతో పాటు ప్రశంసా పత్రం అందుకున్నారు. జిల్లా స్థాయిలోనే అందరు టిబీ సూపర్ వైజర్‌ల కంటే సమర్ధవంతంగా పని చేస్తూ నల్లమల అటవీ ప్రాంతంలోని గిరిజనులకు క్షయ వ్యాధి నివారణతో పాటు నిర్మూలన పద్ధతులు తెలియజేస్తూ మంచి సేవలు అందించినందుకు గాను ఆమెకు ఈ అవార్డు దక్కింది. అవార్డు అందుకున్న సౌమ్య ప్రియదర్శినికి యర్రగొండపాలెం ఏరియా వైద్యశాల వైద్యులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.



జిల్లా స్థాయి అబాకస్ పోటీల్లో ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న దృశ్యం

అబాకస్ పోటీల్లో.. షైనింగ్ స్టార్స్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-సంతనూతలపాడు

ఒంగోలు విశ్వం ఎడ్యుటెక్ వారు శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి అబాకస్ పోటీల్లో స్థానిక షైనింగ్ స్టార్స్ విద్యార్థులు విశేష ప్రతిభ కనపరిచారు. ఈ పాఠశాల 1వ తరగతి విద్యార్థి షేక్ అబ్దుల్ షాజ్, 5వ తరగతి విద్యార్థి షేక్ రోషిణి జిల్లా స్థాయి అబాకస్ పోటీల్లో 3వ స్థానం సంపాదించారు. జిల్లా స్థాయిలో మంచి ప్రతిభ కనపరిచిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ సిహెచ్ అనిత అభినందించారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నాగార్జున

కాపుల ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని పేర్నమిట్ట పరిధిలోని లింగారెడ్డి ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గ స్థాయి కాపుల ఆత్మీయ సమావేశం ఆదివారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి, వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మేరుగు నాగార్జున పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నాగార్జున మాట్లాడుతూ కాపులకు అండగా ఉంటానని, వారిని అన్ని విధాలుగా ఆదుకుంటానని పేర్కొన్నారు. కాపులందరూ కలిసికట్టుగా తన గెలుపునకు కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జ్యేష్ట శ్రీనివాసరావు, ఎంపీటీసీ కే, వెంకటేశ్వరరావు కౌన్సిలర్లు భీమన వెంకటరావు, పత్తి కోటేశ్వరరావు, ఆముదాలపల్లి రాంబ్రహ్మం, పాలడుగు సుబ్బారావు, మాదాసు రాంబాబు, ఇమ్మిశెట్టి బాలకృష్ణ, మొగిలిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


ప్రపంచ క్షయ వ్యాధి నివారణపై అవగాహన

క్షయవ్యాధి నివారణపై అవగాహన

ప్రజాశక్తి - అద్దంకి


ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా హెల్ప్ టిబి ఆధ్వర్యంలో డిబిసి పరిధిలో అవగాహన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన సభకు వి కరుణ అధ్యక్షత వహించారు. సభలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ డాక్టర్ శరత్ కుమార్ మాట్లాడారు. వ్యాధి చాలా ప్రమాదకరమని అన్నారు. రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. వచ్చిన తరువాత ఆలస్యం, అశ్రద్ధ చేయకుండా మందులు వాడు కోవాలని అన్నారు. వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టి శ్రావణి, పి ఈలు పార్వతి, సంధ్య, ఇతర కమ్యూనిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇంకొల్లు న్యాయవాదికి సత్కారం

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్


సుధాకర్‌ను సత్కరిస్తున్న న్యాయమూర్తి

తన బిడ్డలను ప్రయోజకులుగా చేసేందుకు తల్లి ఎన్నో త్యాగాలు చేస్తుందని సుప్రీమ్ కోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ ఎస్‌విఎన్ భట్టి తల్లి ప్రేమను కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హై కోర్టులో జరిగిన అంతర్జా తీయ మహిళా దినోత్సవం హై కోర్టు అడ్వకేట్ అసోసి యేషన్, మహిళా న్యాయవాదుల సమైఖ్య సంయుక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంకొల్లుకు చెందిన హై కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడరు కట్టా సుధాకర్ జస్టిస్ భట్టి జీవితాన్ని కవిత రూపంలో వినిపించారు. మాతృభాష తెలుగును అందంగా అభివర్ణించి మధురంగా వినిపించి నందుకు సుధాకర్‌కు శాలువ కప్పి అభినందించారు. అందుకు కట్టా సుధాకర్ ఆ అవకాశాన్ని కల్పించిన హై కోర్టు న్యాయ వాదుల సంఘం అధ్యక్షుడు కె జానకి రామిరెడ్డికి, రాయలసీమ ఏరియా మునిసిపాలిటీ స్టాండింగ్ కౌన్సిల్ ఎన్ రంగారెడ్డికి, సహకరించిన పెద్దలందరికి కృతజ్ఞతలు తెలిపారు.


అన్నా రాంబాబును సత్కరిస్తున్న గుంటక సుబ్బారెడ్డి

రాంబాబుకు ఘన సత్కారం

ప్రజాశక్తి - మార్కాపురం

పట్టణంలోని 30వ వార్డులో మాజీ ఏఎంసీ చైర్మన్ గుంటక సుబ్బారెడ్డి, మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల కృష్ణ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షెక్షావల్లి ఆధ్వర్యంలో గిద్దలూరు ఎమ్మెల్యే, మార్కాపురం వైసిపి ఇన్చార్జి అన్నా రాంబాబు ఎన్నికల ప్రచారం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి జగన్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి పథకాలను వివరించారు. ఈ సందర్భంగా వార్డులోని ప్రజలు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి స్వాగతం పలికారు.

హార్వెస్టర్ తగిలి మహిళ మృతి

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

భీమవరం గ్రామ పొలాల్లో సెనగ నూర్పిడి సమయంలో లక్ష్మమ్మ పొలంలో కంప పీకుతున్న సమయంలో హార్వెస్టర్ తగిలి తీవ్ర గాయాలతో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం చీరాల వైద్యశాలకు తరలించారు. గురుస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కాని స్టేబుల్ రవి తెలిపారు. వృద్ధురాలు లక్ష్మమ్మగా గుర్తించారు.

ప్రజల స్థిరాస్తులు లాక్కొనేందుకు కుట్ర

ప్రజాశక్తి - మార్టూరు రూరల్, పర్చూరు


టిడిపిలో చేరిన కుంకలమర్రు గ్రామస్తులు

అధికారం కోసం జగన్ చేయబోయే కుట్రలు, దౌర్జన్యాలను సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు కార్యక ర్తలు సిద్ధంగా ఉండాలని ఎంఎల్ఎ ఏలూరి సాంబశివ రావు కోరారు. తన క్యాంప్ కార్యాలయంలో కుంకలమర్రు, పర్చూరు గ్రామాలకు చెందిన 100కుటుంబాలు టిడిపిలో ఆదివారం చేరారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశం లో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రజలంతా ఏకమై టిడిపికి మద్దతుగా నిలవాలని కోరారు. భూ హక్కు చట్టం పేరుతో ప్రజల స్థిరాస్తులను లాక్కునేం దుకు జగన్‌రెడ్డి కుట్ర పన్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందని అన్నారు. కడప జిల్లా ఒంటిమిట్ట మండలం కొత్త మాధవరంలో బీసీ చేనేత కుటుంబానికి చెందిన పాలా సుబ్బారావుకు చెందిన మూడెకరాల భూమి వైసీపీకి చెందిన నాయకులు లాక్కోవడంతో మొత్తం కుటుంబం ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఆస్తులు ఏవిధంగా అన్యాక్రాంతం అవుతున్నాయో చెప్పడానికి ఇదొక ఉదాహరణ అని అన్నారు. ఈ భూమి కొత్తగా వస్తున్న తిరుపతి – కడప ఎక్స్ ప్రెస్ వే ప్రక్కనే ఉండటంతో దాని విలువ రూ.కోట్లలోకి వెళ్లిందని, దీంతో ఆ భూమిపై వైసీపీకి చెందిన కట్టా శ్రావణి కుటుంబం కన్నేసిందన్నారు. స్థానిక తహశీల్దారును ప్రలోభ పెట్టి ఆ మొత్తం భూమిని కట్టా శ్రావణి పేరు మీదకు మార్చుకున్నారని అన్నారు. ఒక పేద చేనేత కార్మికుడికి చెందిన మూడెకరాల భూమిని అధికారం అడ్డంపెట్టుకుని లాక్కోవడంతో మనస్తాపానికి గురైన సుబ్బారావు ఒంటిమిట్ట చెరువు ప్రక్కగా వెళుతున్న రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్య చేసుకోగా ఆయన సతీమణి పద్మావతి, కుమార్తె వినయ ఇంట్లో ఆత్మహత్య చేసుకున్నారని వివరించారు. రెవెన్యూ రికార్డులు తారుమారు చేసి వైసీపీ ఏ విధంగా భూములు లాక్కుంటున్నారో ప్రజలు అర్థం చేసుకోవాలని అన్నారు. సుబ్బారావు మరణవాగ్మూలం చదువుతుంటే హృదయ విదారకంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టుల అధికారాలను తొలగించడానికే రెవెన్యూ అధికారులకు సివిల్ కోర్టు అధికారాలని కట్టబెడుతూ ఈ చట్టం తెచ్చారని మండిపడ్డారు. ఈ నల్లచట్టంతో జగన్‌రెడ్డి, ఆయన ముఠా భూముల్ని ఇష్టారీతిన కొట్టేయడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారన అన్నారు. కోర్టుల అధికారాలు లాగేసి అధికారులకే హక్కుల నిర్ధయాధికారం కట్టబెట్టడం జగన్‌రెడ్డి పెత్తందారీ తనానికి నిదర్శనం అన్నారు. భూమి వివాదంలో ఉన్నా, లేకున్నా రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి అధికారులు ఇతరుల పేర్లను టైటిల్ రిజిస్టర్లలో ఎక్కిస్తున్నారని వివరించారు. వ్యవస్థలను కాపాడి ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాలని కోరారు.

యద్దనపూడి : మండలంలోని పూనూరు గ్రామానికి చెందిన వడ్డెర కాలనీ వాసులు స్థానిక ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు సమక్షంలో టిడిపిలో ఆదివారం చేరారు. వారికి టిడిపి కండువాలు కప్పి పార్టీలోకి సాంబశివరావు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టిడిపికి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రావిపాటి సీతయ్య, వెంకటస్వామి, వడ్డెర కాలనీ వెంకరావు పాల్గొన్నారు.

దళితుల ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి - రేపల్లె



దళితుల ఆత్మీయ సమావేశంలో జి ప్రశాంత్

దళితుల ఐక్యత, సమానత్వం, అభివృద్ధి కోసం ఐక్యవేదిక ఏర్పాటు ఏర్పాటు చేసినట్లు దళిత సంఘల నాయకులు తెలిపారు. భవిష్యత్తులో దళితులు గౌరవం కోసం ఐక్యంగా ముందుకు వెళ్ళాదామని అన్నారు. దళిత ఐక్య వేదిక నాయకులు ముందుగా అంబేద్కర్, బాబూజ గ్జీవన్ రాం చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పిం చారు. దళితుల ఐక్యవేదిక నాయకులు జి ప్రశాంత్, చందో లు దేవదాస్, దారం సాంబశివరావు, ఎం సుధచంద్ర హాసన్, ఎం రాజారత్నం, కొన శ్రీను, డొక్కా శ్రీనుబాబు మాట్లాడుతూ నియోజకవర్గంలో 45వేల ఓట్లు కలిగిన దళితులను అని రంగాలో అభివృద్ధి చేయాలి కోరారు. ప్రధాన రాజకీయపార్టీల్లో ప్రధాన పదవులు ఇచ్చి గౌరవిం చాలని కోరారు. భవిష్యత్తులో శాశనసభకి ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. ఆ దిశగా ఒక వేదికగా ముందుకు వెళ్లడానికి దళితుల్లో ఉన్న వివిధ రాజకీయ పార్టీల్లోని ముఖ్యులు, ప్రజా ప్రతినిధులు, అంబేద్కర్, బాబూజగ్జీవన్ రామ్ యువజన సంఘాలు, దళిత ఎంప్లాయిస్ ఫెడరేష న్స్, నియోజకవర్గంలో వివిధ విభాగాల్లో, సంఘాలలో ఉన్న దళితులు అందరూ ఉమ్మడిగా ముందుకే వెళ్ధామని అన్నారు. నియోజవర్గంలో పెద్ద సంఖ్యలో ఉన్న ఎస్సీ మాదిగ, మాలల ఐక్యతకొరకు, దళిత గ్రామాల అభివృద్ధి కొరకు, దళితులకు రాజకీయ ప్రాధాన్యత పెరగాలని కోరారు. దళితుల గౌరవం కోసం కలిసి పనిచేద్దామని అన్నారు. దళితులు హక్కులు సాధనకోసం ఐక్యం కావా లని కోరారు. సమావేశంలో డాక్టర్ క్రాప రాహుల్, ఎ నాగేశ్వరరావు, ఒబేదు, ఇమ్మనియేలు, భాస్కర్, కె రవికిరణ్, కూచిపూడి మోహనరావు, పి హెనోక్, కె రాజీవ్, కొండద రామ్, డి విజయ్, నీల లక్ష్మణ్, టి శ్రీధర్, ఎం సుబ్బయ్య, కె ప్రతాప్, ఎ కిరణ్, జి కుమార్, సిహెచ్ మణిలాల్, రామారావు, సునీల్ పాల్గొన్నారు.

టిడిపిలో యువకులు చేరిక

ప్రజాశక్తి - బాపట్ల


టిడిపిలో చేరిన నూతన ఓటర్లతో నరేంద్రవర్మ

కర్లపాలెం మండలం ఎంపి రాజుపాలెం గ్రామానికి చెందిన మైనార్టీ సామాజిక వర్గ నూతన ఓటర్లు స్థానిక టిడిపి కార్యాలయంలో టిడిపి అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ సమక్షంలో టిడిపిలో చేరారు. టిడిపి ప్రభుత్వ కాలంలో జరిగిన అభివృద్ధి భవిష్యత్తు తరాలకు నమ్మకం కలిగించేవిధంగా ఉందని వర్మ పేర్కొన్నారు. టిడిపి అధికారానికి వస్తే చేపట్టబోయే సంక్షేమ పథకాలతోపాటు అభివృద్ధి ప్రణాళికలు యువతను ఆకర్షిస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో సయ్యద్ షబ్బీర్, సయ్యద్ సోహెల్, సయ్యద్ అలియాజ్, షేక్ సోహెల్, షేక్ ఇమామ్ అలీ, పఠాన్ బాజీ పాల్గొన్నారు.



అద్దంకిలో ఘనంగా మట్టల ఆదివారం

ఘనంగా మట్టల పండుగ

ప్రజాశక్తి - అద్దంకి

స్థానిక గరటయ్య కాలనీలోని బిలీవర్స్ ఈస్టర్న్ చర్చ్ ఆధ్వర్యంలో ఫాదర్ ఏ కాంతారావు మట్టల ఆదివారాన్ని ఘనంగా జరిపారు. సండే స్కూల్ పిల్లలతో వీధుల వెంట హోసన్నా జయమంటూ కొనియాడారు. ఈ పండుగను ఉద్దేశించి మాట్లాడుతూ ఇది సిలువ మరణా నికి ముందుగా జరుపుకునే పండుగని అన్నారు. ఏసు క్రీస్తు పాపుల కొరకు చనిపోయి సమాధి చేయబడి మూడోదినాన పునరుద్ధానుడై తిరిగి లేస్తాడనే విజయాన్ని సూచించే పండుగగా జరుపుకుంటున్నామని తెలిపారు.

సర్పంచికి ఆహ్వానం లేదా?

ప్రజాశక్తి - భట్టిప్రోలు


సర్పంచి దారా కిరణ్మయి

మండల కేంద్రం భట్టిప్రోలులో ఆదివారం జరిగిన శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి దేవస్థానం రథోత్సవానికి గ్రామ సర్పంచి దారా కిరణ్మయికి ఎలాంటి ఆహ్వానం ఇవ్వకపోవడం పట్ల ప్రజలు విస్మయ వ్యక్తం చేస్తున్నారు. గ్రామ ప్రథమ పౌరురాలుగా రథోత్సవానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను పంచాయతీ ద్వారా సిద్ధం చేసిన సర్పంచికి దేవాదాయ శాఖ అధికారులు ఎలాంటి ఆహ్వానం పంపకపోవడం పట్ల పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల నిబంధనలు అమల్లో ఉన్నప్పటికీ అందుకు అవసరమైన పోటీదారులు రాజకీయ నాయకులను ఆహ్వానించరాదని నిబంధన ఉన్నప్పటికీ ఆ నిబంధన ఈపాటికే సర్పంచ్‌గా ఉన్న తనకు ఏ విధంగా వర్తిస్తుందని సర్పంచి రవికిరణ్మయి ప్రశ్నించారు. మండలంలోని ఎంపీపీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ తదితరులకు ఆహ్వానాలు అందజేసిన అధికారులు సర్పంచికి ఎందుకు ఆహ్వానం అందించలేదని ప్రశ్నించారు. ప్రోటోకాల్ నిబంధన ప్రకారం గ్రామ ప్రథమ పౌరురాలుగా తనకు ఆహ్వానం ఇవ్వకపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. దళిత మహిళ కావటంతోనే తనను రథోత్సవానికి పిలవకుండా అధికారులు అవమానపరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ ప్రజలు గమనించాలని కోరారు.


చేనేత కుటుంబానికి సంఘీభావంగా కొవ్వొత్తుల ర్యాలీ

కొవ్వొత్తులతో ర్యాలీ

ప్రజాశక్తి - చెరుకుపల్లి

అధికార వైసిపి నాయకుల భూ దాహానికి బలైపోయిన చేనేత కుటుంబానికి సంఘీభావంగా ప్రధాన సెంటర్లో టిడిపి నాయకులు కొవ్వొత్తులతో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. వైసిపి నాయకుల భూదాహానికి అనేక మంది నిరుపేదలు, అమాయకులు బలయ్యారని అన్నారు. దోషులు ఎటువంటి వారైనప్పటికీ కఠినంగా శిక్షించాలని టిడిపి బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దివి రాంబాబు డిమాండ్ చేశారు. ఆత్మహత్య చేసుకున్న చేనేత కుటుంబానికి సంఘీ భావం ప్రకటించారు. అధికార దాహంతో నిరుపేదల భూములను ఆక్రమించేసి అనేకమంది ఉసురు పోసుకుంటున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు మల్లాది రామకృష్ణ, కందుల వెంకటేశ్వరరావు, ఎంఆర్‌కె మూర్తి, దివి శ్రీనివాసరావు, నాగుల పున్నారావు, విశ్వంశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



చదలవాడకు పురస్కారం అందజేస్తున్న దృశ్యం

కళామిత్ర పురస్కారం ప్రదానం

ప్రజాశక్తి - ఒంగోలు

స్థానిక ఒంగోలులోని విఐపి రోడ్డునందుగల పద్య సారస్వత పరిషత్ సంస్థ ఆవరణలో ఆ సంస్థ జాతీయ అధ్యక్షులు, ఉత్తమ ప్రధానోపాధ్యాయ అవార్డు గ్రహీత, పద్యభారతి చదలవాడ లక్ష్మీ నరసింహారావును కలిసి వారు చేస్తున్న సాహిత్య సేవకు గుర్తింపుగా ఆయనకు కళామిత్ర ప్రతిభా పురస్కారాన్ని ప్రదానం చేసినట్లు కళామిత్ర మండలి (తెలుగు లోగిలి) జాతీయ సంస్థ అధ్యక్షులు డాక్టర్ నూనె అంకమ్మరావు తెలిపారు. ఈసందర్భంగా నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షులు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ మాట్లాడుతూ లక్ష్మీ నరసింహారావు ప్రబంధ యుగకర్త ఎర్రప్రెగడ అనే పరిశీలనా గ్రంథంతోపాటు శ్రీ గిరి వెంకటేశ్వర శతకం, పద్యభారతి ఖండకావ్యాన్ని, తెలుగు జాతీయములు, నానుడులు - పుట్టుపూర్వోత్తరంలు, రోజుకో సూక్తి మొదలగు గ్రంథాలను రచించారని అన్నారు. ఆయన సాంప్రదాయ బద్ధంగా పద్య కవిత్వం రాయడంలో గొప్ప వారని అన్నారు. పద్య సాహిత్యం పట్ల ఆయన సేవలు నిరుపమానమైనవని అభినందించారు. అందుకే ఆయనకు ఈ అవార్డు ప్రదానం చేస్తున్నామని నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం గౌరవాధ్యక్షురాలు తేళ్ళ అరుణ పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీ కృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షుడు కుర్రా ప్రసాద్ బాబు, నాగినేని నరసింహారావు మెమోరియల్ ఆర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు మిడసల మల్లిఖార్జునరావు, ప్రముఖ కవి యువి రత్నం, నటులు ధేనువకొండ సుబ్బారావు, సాహితీ పోషకులు ఓరుగంటి ప్రసాద్, పి గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.



కరపత్రాలను పంపిణీ చేస్తున్న దేపూరి మస్తాన్

టిడిపితోనే బీసీల అభివృద్ధి

ప్రజాశక్తి-కొండపి

బిసిలు అభివృద్ధి చెందాలంటే టిడిపితోనే సాధ్యమని కొండపి యువత నాయకులు దేపూరి మస్తాన్ తెలిపారు. కొండపి పంచాయితీ బూత్ నెంబర్ 135నందు ఓటర్లకు బాబు సూపర్ 6 పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా దేపూరి మస్తాన్ మాట్లాడుతూ బాబు ప్రవేశ పెట్టిన ఆరు సూపర్ పథకాల వలన ప్రతి కుటుంబ ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. కార్యక్రమంలో యువత నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఏలూరి సమక్షంలో టిడిపిలో చేరిన మధుబాబు

ఏలూరి సమక్షంలో టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - పర్చూరు

పర్చూరు గ్రామానికి చెందిన వైసిపి నాయకులు ఆకుల మధుబాబు, ఇమ్మడిశెట్టి పెద్దబ్బాయి, ఇందిరా కాలనీకి చెందిన ఎస్‌టిలు ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు సమక్షంలో టిడిపిలో చేరారు. వారికి ఆయన టిడిపి కండువాలు కప్పిపార్టీలోకి ఆహ్వానించారు. చంద్రబాబు ప్రకటించిన ఆరు పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు.

ఆత్మహత్యకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

పూర్వీకుల నుండి సంక్రమించిన భూమిని రెవెన్యూ అధికారులు అధికార వైసిపికి చెందిన నాయకులు చేసిన దౌర్జన్యానికి ఒక కుటుంబం ఆత్మహత్యకు కారకులయ్యారని, అలాంటి వారిపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఏపీ చేనేత చేనే కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్ఆర్ కడప జిల్లా ఒంటిమిట్ట మండలం కొత్త మాధవరం గ్రామానికి చెందిన పాలెం సుబ్బారావు అనే చేనేత కార్మికుడు చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తూ ఉంటాడని, ఇతనికి తన పూర్వీకుల నుండి సంక్రమించిన భూమిని అమ్ముకొని తనకున్నప్పులు తీర్చుకోవాలని భావించాడని తెలిపారు. ఈ క్రమంలో తన భూమిని రెవెన్యూ అధికారులు అధికార వైసిపికి చెందిన నాయకులు కలసి కబ్జా చేసి కట్టా శ్రావణి పేరుమీద ఆన్లైన్ చేసి ఉండటంతో ఆందోళన చెందాడని తెలిపారు. తన పూర్వీకుల భూమిని తన పేరున మార్చాలని కొన్ని నెలలుగా రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాడని, ఎంతకీ మర్చకపోవటంతో చేసేదేమీ లేక మనస్థాపానికి గురై శనివారం రైలు క్రింద పడి



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు బాలాజీ

ఆత్మహత్య చేసుకున్నడని అవేదన వ్యక్తం చేశాడు. దీంతో భర్త మరణాన్ని తట్టుకోలేక భార్య పద్మావతి, కుమార్తె వినయ కూడా వారు ఉంటున్న ఇంట్లో ఆత్మహత్యకు పాల్పడ్డారని పేర్కొన్నారు. కడు నిరుపేద చేనేత కుటుంబం సుబ్బారావు కుటుంబానిది హత్యగా భావించి అందుకు బాధ్యులైన రెవెన్యూ అధికారులు, అధికార వైసిపి నాయకులపై హత్యా నేరం క్రింద కేసునమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. మృతులకు ఒక్కొక్కరికి రు.50లక్షల చొప్పున నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సమితి నాయకులు కొడాలి రామ కోటేశ్వరరావు, జి లక్ష్మి పాల్గొన్నారు.

ట్యాంకర్ వస్తేనే.! లేకుంటే క'న్నీళ్లే'.!

- పల్లెల్లో ఒట్టిపోయిన డీప్‌బోర్లు
- పొలం బాట పడుతున్న ప్రజలు

ప్రజాశక్తి - యర్రగొండపాలెం

మండలంలోని గుర్రపుశాల గ్రామం గొంతెండుతుంది. ఆ గ్రామంలో ఉన్న పది డీప్‌బోర్లు ఒట్టిపోయాయి. చుట్టు పక్కల పొలాల్లో ఉన్న వెయ్యి బోర్లలో చుక్కనీరు రావడం లేదు. నీటికోసం రైతులు రూ.కోటి మేరకు ఖర్చు పెట్టి ఇటీవల 700 నుంచి 1000 అడుగుల లోతుకు వంద బోర్లు వేయించారు. ఆ బోర్లలో సుద్దమట్టి తప్ప చుక్కనీరు రాలేదు. దీంతో గత్యంతరం లేక ప్రభుత్వం ట్యాంకర్లు ఏర్పాటు చేసింది. ఇటీవల వాటినీ నిలిపివేయడంతో దాతలు తోలే నీటితో పాటు పొలాల్లో ఎక్కడైనా అరకొరగా వస్తుంటే అక్కడకు వెళ్లి నీళ్లు తెచ్చుకోవాల్సి వస్తోంది. లేకుంటే కన్నీరే మిగులుతోంది. ఇక పాడి పశువులు ఉన్న కుటుంబాల పరిస్థితి వర్ణనాతీతం.



నీళ్ల కోసం ధర్నా నిర్వహిస్తున్న మహిళలు

గుర్రపుశాల గ్రామంలో 650 కుటుంబాలు ఉన్నాయి. 3500 వరకు జనాభా ఉన్నారు. వారి నీటి అవసరాలు తీర్చేందుకు గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో పది డీప్‌బోర్లు వేశారు. అయితే ఆ డీప్‌బోర్లన్నీ ఎండిపోయాయి. వాటిలో చుక్కనీరు రావడం లేదు. గ్రామంలో ఒక డీప్‌బోరు మాత్రం గతుకుతూ వస్తోంది. వీటితో పాటు గ్రామం చుట్టు పక్కల సుమారు వెయ్యి వ్యవసాయ బోర్లు ఉన్నాయి. ఆ బోర్లన్నీ ఎండిపోయాయి. వాటిలోనూ నీరు వచ్చే పరిస్థితి లేదు. దీంతో సాగులో ఉన్న ఉద్యాన పంటలను కాపాడుకునేందుకు రూ.కోటి వ్యయంతో వెయ్యి అడుగుల లోతులో రైతులు తమ పొలాల్లో ఈ వేసవిలో వంద బోర్లు దాకా వేయించారు. ఒకటి అర బోర్లలో తప్పా మిగతా బోర్లలో చుక్కనీరు పడలేదు. రూ.కోటి నిధులు మట్టిపాలయ్యాయి.

మూలనపడ్డ మంచినీటి పథకాలు

గుర్రపుశాల గ్రామంలో మంచినీటి అవసరాలు తీర్చేందుకు 20 ఏళ్ల క్రితం రూ.10లక్షలతో డీప్‌బోరు వేసి ఓవర్ హెడ్ ట్యాంకును నిర్మించారు. దాని ద్వారా గ్రామంలో పైపులైన్ సైతం వేశారు. అయితే దానిని నిర్మించారే కానీ ఒక్కరోజు కూడా నీటిని వదలలేదు. 20ఏళ్ల నుంచి ఆ పథకం మూలనపడింది. గత పది సంవత్సరాల క్రితం ప్రపంచ బ్యాంక్ నిధులు రూ.50లక్షలతో ఆ గ్రామంలో ఓవర్ హెడ్ ట్యాంకును నిర్మించారు. దానికి అనుసంధానంగా గ్రామ సమీపంలో డిప్‌బోర్లు వేశారు. ఆ బోర్ల ద్వారా నీటిని ఓవర్ హెడ్ ట్యాంకుకు పంపింగ్ చేసి ప్రజలకు అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. అయితే గుత్తదారుల అవినీతి, అధికారుల అలసత్వం కారణంగా ఆ పథకం నేటికి వినియోగంలోకి రాలేదు. దీంతో నీరు అందుబాటులో లేక గుర్రపుశాల గొంతెండుతోంది. జలజీవన్ పనులు గ్రామంలో ప్రారంభమైనా అవి పూర్తి కాలేదు. దీంతో ఇంటింటికి మంచినీటి కుళాయి లక్ష్యం నీరు గారింది.

అన్ని గ్రామాల్లో ఇదే పరిస్థితి

యర్రగొండపాలెం మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. నీటి కోసం కోటి పాట్లు పడుతున్నారు. గత్యంతరం లేక పొలం బాట పడుతున్నారు. దీనికి తోడు గత నెల ఒకటో తేది నుంచి మండలంలో ప్రభుత్వం ద్వారా సరఫరా చేసే మంచినీటి ట్యాంకర్లను నిలిపివేశారు. ప్రధాన పార్టీల నాయకులు గ్రామాల్లో నీటి కష్టాలు తప్పించేందుకు అరకొరగా నీళ్ల తోలుతున్నా అవి ఏ మూలకు సరిపోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. దీనికి తోడు ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో రాజకీయ నాయకులు తోలే నీళ్ల ట్యాంకర్లు సైతం ఆపేశారు. ఇప్పుడే నీటి కష్టాలు పడుతున్నాం. ఏప్రిల్, మే నెలల్లో మరి ఏమి చేయాలో అర్థం కావడం లేదంటూ ప్రజలు వాపోతున్నారు. ప్రభుత్వం నీటి కష్టాలు తీర్చాలని కోరుతున్నారు.

పది గ్రామాలకు ట్యాంకర్లపై ప్రతిపాదనలు

ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా నీటి సమస్య తీవ్రంగా ఉన్న 58 గ్రామాలను గుర్తించింది. అందులో తర్లుపాడు మండలంలో రెండు, దొనకొండ మండలంలో పది, త్రిపురాంతకం మండలంలో నాలుగు, పుల్లలచెరువు మండలంలో 16, పెద్దారవీడు మండలంలో 16, యర్రగొండపాలెం మండలంలో పది గ్రామాలు చొప్పున ట్యాంకర్ల ద్వారా నీళ్లు తోలేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. కాగా మండలంలో సుమారు 35 గ్రామాలు దాకా ఉంటే పది గ్రామాలకు ట్యాంకర్లకు అనుమతిస్తే మిగతా 25 గ్రామాల పరిస్థితి ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గతంలో మాదిరిగా అన్ని గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మంచినీటి పథకాలు వినియోగంలోకి తేవాలి

ముండ్లా దానియేలు, మాజీ సర్పంచ్, గుర్రపుశాల

గతంలో రూ.10లక్షలతో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంక్ పదేళ్ల క్రితం ప్రపంచ బ్యాంక్ నిధులు రూ.49లక్షలతో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకు, పైపులైన్ మూలనపడ్డాయి. వాటికి మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకువస్తే గ్రామంలో మంచినీటి సమస్య శాశ్వితంగా పరిష్కారం కానుంది. పాలకులు, అధికారులు ఆ దిశగా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పశు పోషకులకు మరిన్ని కష్టాలు

రువ్వల శ్రీను, యర్రగొండపాలెం

గ్రామంలో చుక్కనీరు దొరకకపోవడంతో ట్యాంకర్లపై ఆధారపడాల్సి వస్తోంది. ట్యాంకర్ల ద్వారా అరకొరగా నీరు వస్తుండడంతో పశు పోషకుల ఇబ్బందులు అన్ని ఇన్ని కాదు. వాటికి నీరు సరిపోక, నీరు దొరికే ప్రత్యామ్నాయం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



ఆర్థిక సహాయం అందజేస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

సూర్యశ్రీ ట్రస్ట్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఒంగోలు

సూర్య శ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ సెక్రెటరీ షేక్ సర్దార్ బాషా ఆధ్వర్యంలో మజీద్ ఏ కౌశర్‌కి (మసీద్) రిపేర్లు, లైటింగ్ ఏర్పాటు కోసం ప్రవాస భారతీయుడు ఈదర సురేష్ ఆర్థిక సహకారంతో రూ.17వేలు ట్రస్ట్ కార్యాలయం నందు ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు. ట్రస్టు చైర్ పర్సన్ షహనాజ్ ద్వారా మసీదు పెద్ద అమీర్ సాహెబ్‌కు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా సర్దార్ మాట్లాడుతూ రంజాన్ మాసంలో దానం ఎంతో పవిత్రమైనదని అన్నారు. ముస్లింలకు ఎంతో పవిత్రమైన రంజాన్ మాసంలో తమ శక్తిమేరకు సమాజంలోని పేదలకు దానం చేయటం విశిష్టమైనదని అన్నారు. ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మారెళ్ళ సుబ్బారావు మాట్లాడుతూ రంజాన్ మాసంలో చేసే ప్రతి దానం ఎన్నో రెట్లు ఫలితాన్ని ఇస్తుందని అన్నారు. మసీద్ మరమ్మతులకు ఆర్థిక సాయం అందించిన ట్రస్టు నిర్వాహకులకు అభినందనలు తెలిపారు.



భగత్‌సింగ్‌కు నివాళి అర్పిస్తున్న మాబు

యువతకు స్ఫూర్తి భగత్‌సింగ్

ప్రజాశక్తి - నాగులుప్పలపాడు

నేటి యువత భగత్ సింగ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్‌కె మాబు పేర్కొన్నారు. ఉప్పుగుండూరులో రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భగత్ సింగ్ వర్ధంతి సభ ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భగత్ సింగ్ స్వాతంత్ర్య పోరాటంలో కీలకపాత్ర పోషించారని అన్నారు. బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడి చిన్నవయస్సులోనే ఉరితీయబడ్డారని అన్నారు. ఏ ఆశయం కోసమైతే పోరాడారో అందుకు భిన్నంగా కేంద్రంలో బిజెపి నరేంద్రమోఢీ ప్రభుత్వం మతాలు, కులాల మధ్య చిచ్చు పెట్టీ విద్వేషాలకు పాల్పడుతుందని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పోరేట్ సంస్థలకు అప్పచెప్పుతుందని అన్నారు. రానున్న ఎన్నికల్లో మతతత్వ బిజెపిని, వారికి మద్దతుగా కూటమి కట్టిన టిడిపి, జనసేనలను, విద్వసంకర వైసిపిని ఓడించేందుకు నేటి యువత భగత్ సింగ్ స్ఫూర్తితో ముందుకు సాగాలని కోరారు. తొలుత భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి శ్రీకాంత్, ఎన్ రామారావు, కాకాని సుబ్బారావు, యు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రిటైర్డు పిఆర్‌ఒ నాగరాజు మృతి

ప్రజాశక్తి-కొండపి

రిటైర్డు పిఆర్‌ఒ మాగులూరి నాగరాజు అనారోగ్య కారణంగా ఆదివారం మృతి చెందాడు. కొండపి పంచాయితీలోని కట్టావారిపాలెంలో నివాసం ఉంటున్న ఆయన కొంత కాలం నుంచి అనారోగ్యంతో బాదపడుతున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. నాగరాజు మృత దేహానికి కొండపి పంచాయితీలోని నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

11వ వార్డులో బూచేపల్లి ప్రచారం

ప్రజాశక్తి-దర్శి

వైసిపితోనే ముస్లింలకు సమన్యాయం జరుగుతుందని జిల్లా పరిషత్ చైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైసిపి దర్శి నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. దర్శి పట్టణంలోని 11వ వార్డులో ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లింలతో కలిసి నమాజ్ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ డైరెక్టర్లు డాక్టర్ ఎస్ఎం.బాషా, సానికొమ్ము తిరుపతిరెడ్డి, కె. అంజిరెడ్డి, వైసిపి మండల అధ్యక్షుడు వెన్నపూస వెంకటరెడ్డి, వార్డు నాయకులు, వైసిపి కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.


మహిళలలో మాట్లాడుతున్న బూచేపల్లి

డివైఎఫ్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

స్థానిక గాంధీ నగర్ భగత్ సింగ్ విజ్ఞాన కేంద్రంలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో చలివేంద్రం ఆదివారం ప్రారంభించారు. స్వాతంత్ర్య సమర యోధులు, విప్లవ వీరులు షాహీద్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌ల 93వ వర్ధంతి వారోత్సవాలలో బాగంగా డివైఎఫ్ఐ నగర కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని డివైఎఫ్ఐ జిల్లా మాజీ కార్యదర్శి పూనాటి.ఆంజనేయులు, డివైఎఫ్ మాజీ నాయకులు కర్రి బాలచంద్రం ఈ చలి వేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పూనాటి ఆంజనేయులు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను సైతం తృణప్రాయంగా అర్పించిన త్యాగధనులు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ దేవ్‌లు అని తెలిపారు. అమరుల త్యాగాల స్ఫూర్తితో డివైఎఫ్ఐ సంఘం యువతి యువకుల సమస్యలపై నిరంతరం పోరాడుతూనే, ఇలాంటి సేవ కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో అభినందించ దగిన విషయమన్నారు. నేటి యువత భగత్ సింగ్ లాంటి విప్లవ వీరులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు, నిరుద్యోగులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి కల్పించడంలో విఫలమైనట్లు తెలిపారు. ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు కారు చౌకగా అమ్మేస్తున్నారన్నారు. రానున్న కాలంలో ఎండలు ఎక్కువగా ఉంటాయి కాబట్టి జిల్లాలో తాగటానికి మంచి నీటి కొరత లేకుండా చూడాలన్నారు. పశ్చిమ ప్రకాశం ప్రాంతాలలో తాగేందుకు మంచినీటి వసతి, పశువులు తాగేందుకు నీటి వసతులు లేవన్నారు. వెంటనే స్పందించి జిల్లాలో ఎక్కడా నీటి ఎద్దడి లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారుల పై ఉందన్నారు, పట్టణ కేంద్రాలు, పల్లెలలో ప్రతిరోజు మంచినీరు ఇచ్చేందుకు ప్రభుత్వ అధికారులు ప్రయత్నం చేయాలన్నారు, ప్రభుత్వం ఆధ్వర్యంలోనే మంచినీటి చలివేంద్రాలు, మజ్జిగ కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కెఎఫ్.బాబు మాట్లాడుతూ దేశభక్తి ఉన్న నాయకుల వర్ధంతులు, జయంతులు సందర్భంగా అమర వీరులకు స్ఫూర్తితో చలివేంద్రాలు, రక్తదాన శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నగర నాయకులు ఎస్‌కె.హరి కష్ణ,టి.దాసు, టి.సురేష్, ఆర్. సురేష్, వెంకటేష్ పాల్గొన్నారు.



రక్తదానం చేసిన వారిని అభినందిస్తున్న మేనేజర్ శ్రీనివాసరావు

గ్రంధి వెంకటేశ్వరరావుకు నివాళి

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండలోని జివిఆర్ ఫ్యాక్టరీ సంస్థల అధినేత గ్రంధి వెంకటేశ్వరరావు 84వ జయంతి సందర్భంగా ఆదివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. తొలుత గ్రంధి వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళుల అర్పించారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. 100 మందికి పైగా కార్మికులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా జివిఆర్ ఫ్యాక్టరీ మేనేజర్ బివిఎన్.శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రంధి వెంకటేశ్వరరావు జివిఆర్ సంస్థలను స్థాపించి అనేక మంది కార్మికులకు అండగా నిలిచారన్నారు. కార్మికుల అండదండలతోటే రక్తదాన శిబిరాన్ని నిర్వహించి ఆయనకు ఘనమైన నివాళి అర్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరితోటి బాబూరావు, శంకర్, దేవినేని బాలాజీ, శ్రీనివాసరావు, డాక్టర్ బి.బ్రహ్మయ్య, ఒంగోలు రిమ్స్ బ్లడ్ బ్యాంకు సిబ్బంది వెన్నెల, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.


వెంకటేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిబ్బంది

భగత్ సింగ్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

హనుమంతునిపాడులో కెసి.రామయ్య అధ్యక్షతన భగత్ సింగ్ 93 వర్ధంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వ్యవసాయ కార్మిక జిల్లా ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జాతీయోద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మార్చి దేశం కోసం అత్యంత చిన్న వయసులో ఉరి కంభం ఎక్కిన గొప్ప త్యాగమూర్తి, దేశభక్తుడు భగత్ సింగ్ అని కొనియాడారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదాన్ని దేశం నుంచి తరిమికొట్టాలని ఉద్యమాన్ని ఉవ్వెత్తున ప్రారంభించిన భగత్ సింగ్, రాజగురు, సుకుదేవ్‌ను 1931 మార్చి 23న అప్పటి దోపిడీ ప్రభుత్వం ఉరితీసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు కె. చిన్న రామయ్య, ధారా నారాయణ, అంద్రా వినయ్, కత్తి మత్తయ్య, జి. రాములు వ్యవసాయ కూలీలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తి : భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ వర్ధంతి ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంరతం నాయకులు మాట్లాడుతూ భగత్ సింగ్, సుఖదేవ్ రాజు గురు ఆశయాలకు అనుగుణంగా యువత ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పూసపాటి వెంకటరావు, బొడ్డు ఓబులేసు, సిహెచ్. కొండయ్య, ఏడుకొండలు, అశోక్, కెవిపిఎస్ నాయకులు టి. రామారావు, రైతు సంఘం నాయకులు కె. శ్రీనివాస్ రెడ్డి, ఓబుల్ రెడ్డి పాల్గొన్నారు.


హనుమంతునిపాడులో నివాళులర్పిస్తున్న నాయకులు



చీమకుర్తిలో నివాళులర్పిస్తున్న నాయకులు

కార్పొరేట్ల కొమ్ముగాస్తున్న

ఎన్‌డిఎ కూటమిని ఓడించండి : సిఐటియు

ప్రజాశక్తి -కనిగిరి

కార్పొరేట్లకు కొమ్ముగాస్తూ కార్మికుల హక్కులను కాల రాస్తున్న ఎన్‌డిఎ కూటమిని రానున్న ఎన్నికల్లో ఓడించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ తెలిపారు. స్థానిక సుందరయ్య భవనంలో సిఐటియు జిల్లా శిక్షణా తరగతులు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక చట్టాలను సవరించి లేబర్ కోడ్లు తీసుకురావడం ద్వారా కార్పొరేట్ల దోపిడీకి తలుపులు బార్లా తెరిచిందన్నారు. ప్రకృతివనరులను, ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా కార్పొరేట్లకు కట్ట బెడుతుందన్నారు. స్కీం వర్కర్లకు కనీస వేతనాలు అమలు కావడం లేదన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ సౌకర్యం కల్పించడం లేదన్నారు. పెట్రోల్, డీజిల్,గ్యాస్,నిత్యావసర సరుకులు ధరలు పెంపుతో పేద, మధ్యతరగతి కుటుంబాల జీవనం దుర్భరంగా మారిందన్నారు ప్రభుత్వరంగ సంస్థలు పరిరక్షణకు, కార్మిక హక్కుల కోసం జరుగుతున్న ఉద్యమాలపై నిర్బంధానికి పూను కుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా నాయకులడు వి.మాలకొండ రెడ్డి, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి బి.రఘురామ్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు పిసి. కేశవరావు, జిల్లా కార్యదర్శి కె.మాల్యాద్రి ,నాయకులు రాయల మాలకొండయ్య, డివైఎఫ్ఐ నాయకుడు నరేంద్ర, జెవివి జిల్లా నాయకుడు శ్రీనివాసులు, ఐద్వా నాయకురాలు బషీరా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి

డోలా సుబ్బమ్మ మృతికి సంతాపం

ప్రజాశక్తి-టంగుటూరు

కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి మాతృమూర్తి డోలా సుబ్బమ్మ (83) శనివారం రాత్రి అనారోగ్యంతో మతి చెందారు. పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, టిడిపి సంతనూతలపాడు నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బిఎన్.విజయకుమార్, మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు, టిడిపి సీనియర్ నాయకుడు దామచర్ల పూర్ణచంద్రరావు, టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య డోలా సుబ్బమ్మ భౌతిక కాయాన్ని ఆదివారం సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సంతాపం తెలియజేశారు. కొండపి, టంగుటూరు, జరుగుమల్లి, పొన్నలూరు, సింగరాయకొండ, మర్రిపూడి మండలాలకు చెందిన టిడిపి నాయకులు, కార్యకర్తలు సుబ్బమ్మకు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆదివారం సాయంత్రం సుబ్బమ్మకు అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టంగుటూరు మాజీ సర్పంచి బెల్లం జయంత్ బాబు, టిడిపి నాయకులు ఈదర ప్రభాకరరావు, జరుగుమల్లి మండల టిడిపి అధ్యక్షుడు పోకూరి రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే స్వామిని పరామర్శిస్తున ఎమ్మెల్యే ఏలూరి